పడకేసిన స్మార్ట్ సిటీ

మాటల మాయల మరాటీ జగన్ అటకెక్కించిన అభివృద్ధి పనుల్లో తిరుపతి స్మార్ట్ సిటీ ఒకటి. అధికారంలో ఉన్న ఐదేళ్లూ ఈ పనుల ఊసు వైసీపీ ప్రభువులకు పట్టనే లేదు. రాష్ట్ర ప్రభుత్వం వాటాగా చెల్లించాల్సిన నిధుల్లోంచి పైసా విదిలించలేదు. తిరుపతి అభివృద్ధి అంటూ ఆర్భాటం చేసిన ఆయన అనుచర స్థానిక నేతలు కూడా ఎంతసేపటికీ టీటీడీ ఖజానాను బాదడానికే ప్రయత్నించారు. అప్పటి సీఎంను ఒప్పించి నిధులు తెప్పించడంలో విఫలమయ్యారు. ఫలితంగా మూడేళ్లలో పూర్తి కావాల్సిన స్మార్ట్ పనులు ఎనిమిదేళ్లయినా పూర్తి కాలేదు. ఇటీవల జరిగిన జిల్లా కలెక్టర్ల సదస్సులో పెండింగ్‌లో ఉన్న స్మార్ట్ పనులను తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకు వెళ్లారు. జిల్లా ప్రజాప్రతినిధులు చొరవతీసుకుని సీఎంను ఒప్పించి నిధులు రప్పించడంపై శ్రద్ధ పెడుతారనే ఆశ ప్రజల్లో ఉంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



వినాయక సాగర్ పార్కులోపల అమెనిటీస్ భవనం ఇలా ఆగిపోయింది

ఐదేళ్లూ అటకెక్కించిన జగన్ ప్రభుత్వం

చంద్రబాబుపై పెరిగిన ఆశలు



అసంపూర్తిగా వున్న మల్టీ లెవల్ కార్ పార్కింగ్ నిర్మాణం

■ ఏమిటీ స్మార్ట్ సిటీ ప్రాజెక్టు?

కేంద్ర ప్రభుత్వం 2017-18లో స్మార్ట్ సిటీ మిషన్ పేరిట దేశవ్యాప్తంగా ప్రాముఖ్యత కలిగిన నగరాలను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఆ పథకం కింద రాష్ట్రం నుంచీ కాకినాడ, తిరుపతి ఎంపికయ్యాయి. తిరుపతి నగరాన్ని రూ. 1586 కోట్లతో స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేయాలని లక్ష్యం పెట్టుకుంది. ఈ ఖర్చులో కేంద్రం రూ. 500 కోట్లు, రాష్ట్రం రూ. 500 కోట్లు భరించాలి. మిగిలిన రూ. 586 కోట్లలో టీటీడీ రూ. 435.50 కోట్లు, ఎస్పీడీసీఎల్ రూ. 150.54 కోట్లు ఇవ్వాలి. ఈ మొత్తం నిధులతో నగర ప్రజలకు, యాత్రికులకు ఉపయోగపడే 97 పనులను తిరుపతి నగరంలో ప్రతిపాదించారు. ఆధునిక రవాణా, క్రీడలు, వినోద, విహార సదుపాయాలు అందుబాటులోకి తెచ్చే పనులవి. ఈ పనులన్నీ 2019-20కి పూర్తి కావాలి.



■ ఎనిమిదేళ్ళయినా పూర్తి కాని పనులు

తిరుపతి స్మార్ట్ సిటీ ప్రాజెక్టు పనులు పూర్తి కావడానికి పెట్టుకున్న మూడేళ్ల గడువు కాదు కదా అది దాటి ఐదేళ్ళవుతోంది. మొత్తంగా ప్రాజెక్టు ప్రారంభమై ఎనిమిదేళ్ళవుతున్నా ఇంకా కొన్ని పనులు పెండింగులోనే వున్నాయి. 97 పనులకు గానూ 83 పూర్తయ్యాయి. మిగిలిన 14 పనులు పెండింగులో వున్నాయి. ఇప్పటి వరకూ సుమారు రూ.1109 కోట్లు విడుదలయ్యాయి. పూర్తయిన 83 పనుల్లోనూ 10-12 పనులకు సుమారు రూ. వంద కోట్ల బిల్లులు పెండింగులో వున్నాయి. అలాగే పెండింగులో వున్న 14 పనులకు సంబంధించి జరిగినంత వరకూ రూ.60 కోట్ల దాకా బిల్లులు పెండింగు పడ్డాయి. మొత్తంగా పెండింగు బిల్లులకే రూ.160 కోట్లు బకాయి చెల్లించాల్సి వుంది.

■ రూ. 405 కోట్లు విడుదలైతేనే స్మార్ట్ సిటీకి మోక్షం

తిరుపతి స్మార్ట్ సిటీ ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ. 1586 కోట్లు కాగా ఇప్పటి వరకూ కేంద్ర ప్రభుత్వం తన వాటా రూ. 500 కోట్లలో రూ. 388.02 కోట్లు విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటా రూ. 500 కోట్లలో రూ. 186 కోట్లు విడుదల చేసింది. టీటీడీ తన వాటా రూ. 435.50 కోట్లలో రూ. 385.50 కోట్లు విడుదల చేసింది. ఎస్పీ డీసీఎల్ వాటా రూ. 150.54 కోట్లకు గానూ మొత్తం ఖర్చు చేసేసింది. కేంద్రం నుంచీ రూ. 98 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం నుంచీ రూ. 304 కోట్లు, టీటీడీ నుంచీ రూ. 50 కోట్లు చొప్పున ఇంకా నిధులు విడుదల కావాల్సి వుంది. ఇందులో టీటీడీ నిధుల విడుదలకు ఎలాంటి సమస్యా లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధుల విడుదలే సమస్యగా మారింది. ఈ నిధులు విడుదలైతే తప్ప తిరుపతి స్మార్ట్ సిటీ పనులకు మోక్షం కలగని పరిస్థితి నెలకొనివుంది. ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకుంటే తప్ప ఇది సాధ్యం కాదు.

■ నాలుగేళ్ళలో నయాపైసా విదిలించని వైసీపీ

2019-24 నడుమ ఐదేళ్ళ పాటు అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం చివరి నాలుగేళ్లలో తన వాటా నిధుల నుంచీ నయాపైసా కూడా స్మార్ట్ సిటీ ప్రాజెక్టుకు విడుదల చేయలేదు. మూడు విడతలుగా రూ.304 కోట్లు విడుదల చేయాల్సి ఉంది. దీంతో కేంద్రం కూడా మెలిక పెట్టింది. రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధులు పూర్తిగా విడుదలయ్యాకే తన వాటా నిధుల్లో పెండింగ్ వున్న రూ.98 కోట్లు విడుదల చేస్తామని స్పష్టం చేసింది. తిరుపతి ఎమ్మెల్యే, అప్పటి టీటీడీ ఛైర్మన్ కూడా అయిన భూమన కరుణాకర్‌రెడ్డి టీటీడీ నిధుల కోసం ప్రయత్నించారే తప్ప సీఎం జగన్‌ను ఒప్పించి నిధులు తెచ్చే పని చేయలేకపోయారు. రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన రూ.304 కోట్లలో రూపాయి కూడా విడుదల చేయించలేకపోయారు.



వినాయకసాగర్ వద్ద అసంపూర్తిగా కూరగాయల మార్కెట్ భవన సముదాయం

అంచనా వ్యయం సవరించాలి

2017-18లో మొదలై పెండింగ్‌లో ఉన్న స్మార్ట్ సిటీ పనులు పూర్తి కావాలంటే నిర్మాణ వ్యయం సవరించక తప్పదు. పెరిగిన మెటీరియల్ ధరలకు అనుగుణంగా పెంచాల్సి ఉంటుంది. లేకపోతే నాణ్యత పాటించే పరిస్థితి వుండదని మున్సిపల్ ఇంజనీరింగ్ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి.

ఇవీ పెండింగులో వున్న స్మార్ట్ సిటీ పనులు

పని పేరు	అంచనా వ్యయం	జరిగిన శాతం	జరిగిన చెల్లింపులు
నిరంతర నీటి సరఫరా	రూ. 29.90 కోట్లు	90 %	రూ. 19.96 కోట్లు
వినాయకసాగర్ అమెనిటీస్ భవనానికి అదనపు అంతస్తు నిర్మాణం	రూ. 1.64 కోట్లు	85 %	రూ. 1.22 కోట్లు
గొల్లవానిగుంట చెరువు అభివృద్ధి	రూ. 1.21 కోట్లు	80 %	రూ. 0.71 కోట్లు
కమాండ్ కంట్రోల్ సెంటర్	రూ. రూ. 180 కోట్లు	15 %	రూ. 11 కోట్లు
వినాయక సాగర్ స్విమ్మింగ్ పూల్	రూ. 3.03 కోట్లు	55 %	రూ. 0.88 కోట్లు
వినాయకసాగర్ మార్కెట్ అభివృద్ధి	రూ.1.09 కోట్లు	75 %	రూ. 0.79 కోట్లు
వినాయకసాగర్లో జిమ్, ఫన్‌జోన్ అమెనిటీస్	రూ. 1.99 కోట్లు	70 %	రూ. 070 కోట్లు
వినాయకసాగర్లో ఆర్టిఫిషియల్ గ్లోయింగ్ యానిమల్స్	రూ. 1.25 కోట్లు	25 %	--
నెహ్రూ మున్సిపల్ స్కూల్లో ఇండోర్ స్టేడియం	రూ. 0.61 కోట్లు	65 %	రూ. 0.36 కోట్లు
తూకివాకంలో సావేజ్ ప్లాంట్	రూ.45.75 కోట్లు	65 %	రూ. 21.17 కోట్లు
మున్సిపల్ ఆఫీసు భవనం	రూ. 94.50 కోట్లు	60 %	రూ. 16.60 కోట్లు
ఏడంతస్తులతో మల్టీలెవల్ కార్ పార్కింగ్, మల్టీ ప్లెక్స్	రూ. 52.50 కోట్లు	20 %	రూ. 7.34 కోట్లు
వినాయకసాగర్ మార్కెట్	రూ. 2 కోట్లు	31 %	రూ. 0.52 కోట్లు
తూకివాకంలో 6 మెగావాట్స్ సోలార్ పవర్ ప్రాజెక్ట్	రూ. 21.80 కోట్లు	75 %	రూ. 14.30 కోట్లు
మొత్తం	రూ. 437.27 కోట్లు		రూ. 95.55 కోట్లు

■ ఆశలన్నీ ముఖ్యమంత్రి పైనే!

తిరుపతి నగరాన్ని కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ సిటీగా ఎంపిక చేయడంలో అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు కీలక పాత్ర పోషించారు. ఇందులో భాగంగానే తిరుపతిలో గరుడ వారధిని ఆయనే ప్రతిపాదించారు. నిర్మాణ పనులకు శంకుస్థాపన కూడా చేశారు. 2017-18, 2018-19లలో రెండేళ్ళ పాటు ఆయన హయాంలో నిధుల విడుదల కూడా సాఫీగా జరిగింది. తర్వాత ఐదేళ్ళ పాటు వైసీపీ ప్రభుత్వం చూపిన నిర్లక్ష్యంతో స్మార్ట్ సిటీ ప్రాజెక్టు అటకెక్కింది. ఇపుడు మళ్ళీ చంద్రబాబు నాయుడు సీఎం కావడంతో నగర వాసులు ఆయనపైనే ఆశలు పెట్టుకుంటున్నారు. మంగళ, బుధవారాల్లో అమరావతిలో జరిగిన కలెక్టర్ల కాన్ఫరెన్సు సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ తిరుపతి స్మార్ట్ సిటీ ప్రాజెక్టు పెండింగ్ పనులను ప్రస్తావించి నిధులు విడుదల చేయాలని సీఎంను అభ్యర్థించారు కూడా.



నెహ్రూ మున్సిపల్ హైస్కూలు ఆవరణలో ఆగిపోయిన ఇండోర్ స్టేడియం

మామిడిపండ్లు వచ్చేశాయోచ్

మామిడి పండ్ల సీజన్ ఆరంభమైంది. జనవరిలోనూ భారీ వర్షాలు కురవడంతో మామిడిపూత తక్కువగా కనబడింది. అయితే చెట్లను రైతులు తిరిగి సంరక్షించుకోవడంతో కాపు మొదలైంది. శుక్రవారం శ్రీకాళహస్తి పట్టణంలోని ప్రాంతాల్లో తొలిసారిగా మామిడిపండ్లు కనిపించాయి. తొలిసారి కాపు కావడంతో కిలో రూ.250 ధర పలికింది.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి



స్మార్ట్ సిటీ పనులను త్వరగా పూర్తి చేయండి



కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 28(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలో స్మార్ట్‌సిటీ నిధులతో జరుగుతున్న పెండింగ్ పనులను సకాలంలో పూర్తిచేయాలని స్మార్ట్‌సిటీ ఛైర్మన్, కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం స్మార్ట్‌సిటీ ఎండీ, కమిషనర్ మౌర్య అధ్యక్షతన 38వ బోర్డు మీటింగ్ నిర్వహించారు. వర్చువల్ విధానంలో కలెక్టర్ మాట్లాడుతూ.. ఐ ట్రిపుల్ సీ (ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్) విధానం ద్వారా స్మార్ట్ సిటీ పనులపై నిరంతర పర్యవేక్షణ ఉండేలా చూడాలన్నారు. త్వరగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బోర్డు డైరెక్టర్లు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, ఇంజనీరింగ్ చీఫ్, ఇండిపెండెంట్ డైరెక్టర్లు డాక్టర్ రామచంద్రారెడ్డి, రమాశ్రీ, స్మార్ట్‌సిటీ జీఎం చంద్రమౌళి పాల్గొన్నారు.

పాముల సయ్యాట



సాయంసంధ్య వేళ.. గంటన్నరసేపు రెండు పాములు మైమరచి సయ్యాటలాడాయి. దారిన పోయేవారు సందడి చేసినా తమకేమీ పట్టనట్టు వ్యవహరించాయి. ఈ దృశ్యం కేవీబీపురం మండలం కళత్తూరు పెద్ద చెరువు వద్ద కనిపించింది.

- కేవీబీపురం, ఆంధ్రజ్యోతి

ఒకటిన పింఛన్ల పంపిణీ

● **2,61,841 మందికి రూ.111.82 కోట్లు కేటాయింపు**

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఏప్రిల్ ఒకటో తేదీ ఉదయం 7 గంటల నుంచి ఇళ్లవద్ద లబ్ధిదారులకు అందజేయనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 2,61,841మందికి రూ.111.82 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. 34 మండలాల్లో పింఛన్ల పంపిణీ విధుల్లో 5వేలమంది సచివాలయ సిబ్బంది పాల్గొంటారని పేర్కొన్నారు.

ఎల్లుండి టెన్త్ పరీక్ష వాయిదా

● **1న సోషియల్ పరీక్ష నిర్వహణ**

తిరుపతి(విద్య), మార్చి 28(ఆంధ్రజ్యోతి): రంజాన్ సందర్భంగా పదో తరగతి చివరి రోజు సోషియల్ పరీక్షను మంగళవారానికి వాయిదా వేసినట్టు డీఈవో కేవీఎన్ కుమార్ తెలిపారు. పరీక్షల షెడ్యూల్లో భాగంగా చివరి పరీక్ష సాంఘిక శాస్త్రం ఈనెల 31న (సోమవారం) జరగాల్సి ఉందన్నారు. ఆ రోజు రంజాన్ రావడంతో మంగళవారానికి సాంఘిక శాస్త్ర పరీక్ష వాయిదా పడిందన్నారు. కాగా, శుక్రవారం జరిగిన జీవశాస్త్రం పరీక్షకు 348 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 27,141 మందికిగాను 26,793 మంది పరీక్ష రాశారు.

ఈకేవైసీ చేసుకోవాల్సింది 1.58 లక్షల మంది

● **నెలాఖరు వరకే గడువు**

తిరుపతి(నేరవిభాగం), మార్చి 28(ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డులకు సంబంధించి జిల్లాలో ఇంకా 1.58 లక్షల మంది ఈకేవైసీ చేసుకోవాల్సి ఉంది. వీరిలో ఐదేళ్లపైబడిన పిల్లలు 22,300 మంది ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది తూర్పు మండలాల్లోనే ఉంటున్నట్లు అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. వీరంతా నెలాఖరులోగా ఈకేవైసీ చేసుకోకుంటే రేషన్ సరుకులు అందవని అధికారులు అంటున్నారు. జిల్లాలోని రేషన్ కార్డుల్లో 16.30 లక్షల మంది సభ్యులు ఉన్నారు. వీరిలో పెండింగ్ ఉన్న వారు మాత్రమే ఈకేవైసీ చేసుకోవాలని అధికారులు చెబుతున్నారు. అయితే, ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన రేషన్‌కార్డుల్లోని సభ్యులు ఈకేవైసీ చేసుకోవడంలో సమస్య తలెత్తుతోంది. ఇలాంటి వారు స్థానికంగా కాకున్నా రాష్ట్రంలోని ఏ ప్రాంతంలో ఉన్నా అక్కడ మీ సేవ, రేషన్ షాపులు, ఆధార్ కేంద్రాల్లో ఈకేవైసీ చేయించుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. రేషన్ డీలర్లు, తహసీల్దార్లు, డీఎస్‌వోలు, లాగిన్లలో ఈకేవైసీ వివరాలు అందుబాటులో ఉంచారు.

జిల్లా స్పెషల్ బ్రాంచ్ ప్రక్షాళన షురూ

● **తొలి విడతలో 16 మంది హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్ల బదిలీ** ● **అందులో ఎనిమిది మంది వీఆర్‌కు**

తిరుపతి(నేరవిభాగం), మార్చి 28(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన హర్షవర్ధనరాజు స్పెషల్ బ్రాంచి (ఎస్బీ)లో ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. గత ఐదేళ్ల పాటు ఒకే చోట పనిచేస్తూ పలువురు అప్పటి వైసీపీ ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేశారనే ఆరోపణలు ఉన్నాయి. అప్పటి ప్రజా ప్రతినిధుల అడుగుజాడల్లో నడచి పోలీసు శాఖ ప్రతిష్ఠను దిగజార్చినట్లు పలువురిపై ఆరోపణలు ఉన్నాయి. దీంతో తొలి విడతగా ఎస్బీని ప్రక్షాళన చేసి.. ఆ తర్వాత కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐలు, ఎస్ఐలను బదిలీ చేయాలని ఎస్పీ నిర్ణయించినట్లు సమాచారం. దీంతో ఉన్నపళంగా ఎస్బీలోని పలువురు హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న ఎనిమిది మందిని వీఆర్‌కు బదిలీ చేశారు. వారిలో.. తిరుమల ఎస్బీలోని ఏఎస్ఐ కుమారస్వామి, తిరుపతి వెస్ట్ సోమ్లానాయక్, వడమాలపేటలోని మురళీ రెడ్డి, పిచ్చాటూరు, కేవీబీపురంలో పనిచేస్తున్న శ్రీరాములు, తొట్టంబేడు, బీఎన్‌కండిగలో పనిచేస్తున్న శ్రీహరి, పుత్తూరులో పనిచేస్తున్న దేవరాజులు, తిరుపతి ఎస్బీలోని నిరంజన్, శ్రీకాళహస్తి వన్‌టౌన్, టూటౌన్‌లో ఉన్న చెంచురామయ్య ఉన్నారు. ఇక, వివిధ కేడర్లలో పలు చోట్ల పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లను స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు. వారిలో ఇప్పటి వరకు తిరుపతి వీఆర్‌లో ఉన్న గోవిందస్వామి, ధనంజయ, తిరుచానూరులో పనిచేస్తున్న పద్మనాభం, శ్రీకాళహస్తి వన్‌టౌన్‌లో పనిచేస్తున్న సుందర్, తిరుమల వన్‌టౌన్‌లోని జయకుమార్, తిరుపతి సీసీఎస్‌లో పనిచేస్తున్న శ్రీనివాసులు, ఎస్వీయూ క్యాంపస్‌లోని ఉదయ్‌కుమార్, తిరుపతి సీసీఎస్‌లోని యుగంధర్ ఉన్నారు. ఈ మేరకు ఎస్పీ హర్షవర్ధనరాజు ఉత్తర్వులు జారీ చేసి.. తక్షణం అమల్లోకి వస్తాయన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:27 (శనివారం సాయంత్రం)

సహర్: 4:52 (ఆదివారం ఉదయం)

అభివృద్ధి పనులకు పచ్చజెండా

● **ఎస్వీయూ పాలకమండలిలో పలు తీర్మానాలు**

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ పాలక మండలి సమావేశం పలు అభివృద్ధి పనులకు పచ్చజెండా ఊపింది. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. పరీక్షా పేపర్ల మూల్యాంకనం రుసుం పెంచాలని నిర్ణయించింది. వీసీ అప్పారావు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో తొలుత ఆర్థిక కమిటీ సమావేశం నిర్వహించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన సాధారణ బడ్జెట్‌కు ఆమోదం తెలిపారు. ఉద్యోగుల వేతనాలకు సంబంధించిన రూ.226 కోట్లకు ఆర్థిక అనుమతులు తీసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలకు రూ.100 కోట్ల రెండో దశ నిధుల కేటాయింపునకు అనుమతులు పొందారు. ఫార్మసీ కాలేజీ భవన నిర్మాణానికి అనుమతి తీసుకున్నారు. యూనివర్సిటీలో అత్యవసర ఇంజినీరింగ్ పనులకు ఆమోదం తెలిపారు. అనుబంధ కాలేజీల గుర్తింపునకు ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు, ఉన్నత విద్యాశాఖ తరఫు ప్రతినిధి భరత్‌గుప్తా, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ మధుమూర్తి, ఆర్థిక శాఖ సంయుక్త కార్యదర్శి అల్లాడ గౌతమ్, ఈసీ సభ్యులు జ్యోతి, నారాయణబాబు, సంధ్యారాణి, మొహిద్దీన్‌బాషా, మంజుల, సుమకిరణ్, సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నామినేటెడ్ ఆశలు

- వివరాలు 6లో -

● జాబితాలతో సిద్ధమైన టీడీపీ, జనసేన

● తిరుపతిలో కరువైన ఏకాభిప్రాయం

● నేడు విజయవాడకు తుది జాబితా?

చంద్రగిరి

పాడి రైతుల సంక్షేమమే హెరిటేజ్ ధ్యేయం


రైతులతో మాట్లాడుతున్న హెరిటేజ్ ఫుడ్స్ ప్రెసిడెంట్ సాంబశివరావు

భాకరాపేట, మార్చి 28(ఆంధ్రజ్యోతి): పాడి రైతుల సంక్షేమమే హెరిటేజ్ డెయిరీ లక్ష్యమని ఆ సంస్థ ప్రెసిడెంట్ సాంబశివరావు అన్నారు. చిన్నగొట్టిగల్లు మండలం టి.కుమ్మరపల్లెలో పాడి పశువుల పెంపకంపై శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులు ఆరోగ్యంగా ఉండాలంటే కేవలం దాణా ఇవ్వడమే కాకుండా మినరల్ మిక్సర్, క్యాల్షియం వంటివి కూడా ఇవ్వాలన్నారు. పశువులకు బీమా చేయించాలన్నారు. అనంతరం గర్భ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. నట్టల నివారణ మందులు స్ప్రే చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొక్యూర్మెంట్ హెడ్ రామ్మోహన్ రావు, జోనల్ మేనేజర్ శివశంకరయ్య, జోనల్ హెడ్ గోపాలకృష్ణ, రీజనల్ హెడ్ సర్వోత్తమ్ రెడ్డి, పీలేరు ప్రొక్యూర్మెంట్ మేనేజర్ శివశంకరయ్య, సూపర్‌వైజర్లు మహేశ్ రెడ్డి, శేఖర్, బాలకృష్ణ, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

చంద్రగిరి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం బందార్లపల్లెకు చెందిన ఓ వృద్ధురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసుల కథనం మేరకు .. మండలంలోని బందార్లపల్లెకు చెందిన జయమ్మ(79) కడుపు నొప్పి తాళలేక ఈనెల 26వ తేదీన పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు గుర్తించి ఆమెను తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు తిరుచ్చిపై సిరుల తల్లి సాక్షాత్కారం



తిరుచానూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని పద్మావతి అమ్మవారు శుక్రవారం రాత్రి బంగారు తిరుచ్చిపై ఊరేగుతూ భక్తులకు సాక్షాత్కరించారు. ఉదయం అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి మూలమూర్తికి నేత్రపర్వంగా అర్చకులు అభిషేకం చేశారు. అనంతరం ఉత్సవర్లకు కల్యాణోత్సవం జరిగింది. మధ్యాహ్నం ఉత్సవర్లకు వేడుకగా తిరుమంజనం జరిపించారు. సర్వ అలంకార శోభితురాలైన అమ్మవారు తిరుచ్చిపై కొలువుదీరి తిరుమాడ వీధుల్లో ఊరేగి భక్తులకు అభయమిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సుభాస్కర్‌నాయుడు, చలపతి, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

6న శ్రీవారి ఆలయంలో శ్రీరామనవమి ఆస్థానం

● 7న శ్రీరామ పట్టాభిషేకం

తిరుమల, మార్చి28(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో ఏప్రిల్ 6వ తేదీన శ్రీరామనవమి ఆస్థానం నిర్వహించనున్నారు. ఆ రోజు ఉదయం 9 నుంచి 11 గంటల వరకు రంగనాయకుల మండపంలో సీతారామలక్ష్మణ సమేత హనుమంత స్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో అభిషేకం చేస్తారు. సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు హనుమంత వాహనంపై శ్రీరాముడు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షిస్తారు. రాత్రి 9 నుంచి 10 గంటల మధ్య ఆలయంలోని బంగారు వాకిలి వద్ద శ్రీరామనవమి ఆస్థానాన్ని వేడుకగా నిర్వహిస్తారు. ఇక, 7వ తేది రాత్రి 8 నుంచి 9 గంటల మధ్య బంగారు వాకిలి వద్ద ఆలయ అర్చకులు శ్రీరామపట్టాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. కాగా, ఏప్రిల్ నెలలో 10 నుంచి 12వ తేదీ వరకు వసంతోత్సవాలు, 12న పౌర్ణమి గరుడసేవ, తుంబురతీర్థ ముక్కోటి, 23న భాష్యకార్ల ఉత్సవం, 30న అక్షయతృతీయ వంటి పర్వదినాలనూ నిర్వహించనున్నారు.

రెండు ఆలయాల్లో చోరీ


ముళ్లచెట్లలో పడి ఉన్న హుండీని బయటకుతీస్తున్న స్థానికులు

తడ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కారిజాత గ్రామంలో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయం, దళితవాడలోని సీతారాముల ఆల యంలో హుండీలు చోరీకి గురయ్యాయి. గురువారం అర్థరాత్రి సమయంలో దొంగలు ఆలయంలోకి చొరబడి హుండీలను ఎత్తుకెళ్లారు. ఈ రెండు హుండీలను గ్రామ శివార్లలోని చెట్లలో పడేసి, వాటిల్లో నగదు ఎత్తుకెళ్లారు. దళితవాడలో ఉన్న సీతారాముల ఆల యంలోని హుండీలో సుమారు రూ.30వేలవరకు భక్తులు సమర్పిం చిన కానుకలు ఉండవచ్చని గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా అమావాస్య ఉత్సవం



శ్రీకాళహస్తి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం అమావాస్య ఉత్సవం ఘనంగా జరిగింది. జ్ఞానప్రసూ నాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడి ఉత్సవమూర్తులకు ఆలయంలోని అలంకార మండపంలో విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రాలనడుమ స్వామిఅమ్మవార్లు పురవీధుల్లో ఊరేగారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే జ్ఞానప్రసూనాంబకు శుక్రవారాన్ని పురస్కరించుకుని విశేష ఉత్సవం నిర్వహించారు. అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబిక అమ్మవారి ఉత్సవ మూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయంలో ప్రాకారంగా ప్రదక్షిణ చేసి తిరిగి కొలువు తీర్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఎస్‌ఐ, కానిస్టేబుళ్లకు గాయాలు

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తహనగర్ జాతర బందోబస్తుకు వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎస్‌ఐ విశ్వనాథనాయుడు, కానిస్టేబుల్ ప్రభాకర్‌కు గాయాలయ్యాయి. మండలంలోని తహనగర్‌లో గురువారం జాతర జరిగింది. జాతరలో బందోబస్తు నిర్వహించి రాత్రి 12 గంటల సమయంలో ఎస్‌ఐ, కానిస్టేబుల్‌తో కలిసి వాహనంలో తిరిగి వస్తుండగా జీఎన్‌కండ్రిగ దగ్గర వ్యాన్‌కు అడ్డంగా పంది రావడంతో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో వాహనంలో ఉన్న ఎస్‌ఐ, కానిస్టేబుల్‌కు గాయాలవడంతో స్థానికులు వారిని శ్రీకాళహస్తిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఎస్‌ఐను మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఎస్‌ఐను ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు, వైసీపీ మండల కన్వీనర్ మణినాయుడు ఆస్పత్రిలో పరామర్శించారు.

వీడిన యువతి అదృశ్యం కేసు

వరదయ్యపాళెం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు చొరవతో యువతి అదృశ్యం కేసు మిస్టరీ వీడింది. మండలంలోని పాండూరు పంచాయతీకి చెందిన నాగరాజు కుమార్తె స్నేహ రెండు రోజుల కింద సూళ్ళూరుపేట ఆస్పత్రికి వెళ్లి అదృశ్యమైంది. దీనిపై గురువారం ఎమ్మెల్యే ఆదిమూలం ఎస్పీని కలిసి వివరించారు. ఎస్పీ ఆదేశాలతో పోలీసు బృందం విచారణ చేపట్టి తిరుపతిలోని శ్రీనివాసం భక్తుల విడిది కేంద్రంలో ఉన్నట్లు పోలీసులు గుర్తించి శుక్రవారం ఆ యువతిని తల్లిదండ్రులకు అప్పగించారు.

నారావారిపల్లె ఆస్పత్రిలో రోగులకు ఉచిత భోజనం ప్రారంభం

చంద్రగిరి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): నారావారిపల్లెలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు ఉచిత భోజన పథకాన్ని, ఆర్వో వాటర్ ప్లాంట్‌ను శుక్రవారం ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్, వైద్యులు, సర్పంచ్ బొబ్బా లక్ష్మి పాల్గొన్నారు.

టీడీపీ ఆవిర్భావ దినోత్సవానికి తరలిరండి

రామచంద్రాపురం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండలంలో టీడీపీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు భారీగా తరలి రావాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు తిరుమలరెడ్డి నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం నెన్నూరులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే పులివర్తి నాని ముఖ్యఅతిథిగా విచ్చేసి పార్టీ జెండాను ఆవిష్కరిస్తారని వివరించారు. అనంతరం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో 50 శాతం రాయితీతో ప్రభుత్వం మంజూరు చేసిన పనిముట్లను రైతులకు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు.

ఆరు ఎర్రచందనం దుంగలు స్వాధీనం



చంద్రగిరి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురం సమీపంలోని పొలాల్లో ఆరు ఎర్ర చందనం దుంగలను పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. శుక్రవారం మండలంలోని శ్రీనివాసమంగాపురం సమీపంలోని రైల్వే బ్రిడ్జి వద్ద ఆరు ఎర్ర చందనం దుంగలను పశువుల కాపరులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు దుంగలను స్వాధీనం చేసుకొన్నారు. ఈ దుంగలు సుమారు 183 కేజీలు బరువు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వాటిని టాస్క్‌ఫోర్స్ అధికారులకు అప్పగించనున్నట్లు సీఐ సుబ్బరామిరెడ్డి తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం రక్షించిన పోలీసులు

తిరుమల, మార్చి28(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఆత్మహత్య చేసుకోబోయిన యువకుడిని పోలీసులు రక్షించారు. బెంగళూరుకు చెందిన చేతన్(24) తన కుటుంబ సభ్యులతో గొడవపడి ఈ నెల 22న ఇంటి నుంచి తిరుమలకు చేరుకున్నాడు. తిరుమలలోని పాండవతీర్థం సమీపంలో గాజుపెంకులతో ఆత్మహత్యకు పాల్పడుతున్నట్టు పోలీసులకు సమాచార ం వచ్చింది. టూటౌన్ పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని అతడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కౌన్సిలింగ్ ఇచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో ఏడుగురికి రూ.70 వేల జరిమానా

తిరుపతి(నేరవిభాగం), మార్చి 28(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మద్యంతాగి వాహనాలు నడిపిన కేసుల్లో ఒక్కొక్కరికి రూ.10,000 వంతున ఏడుగురికి రూ.70 వేల జరిమానా విధించారు. ఈ మేరకు నాలుగో అదనపు జ్యుడిషియల్ న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పునిచ్చారు. కాగా, నగరంలో కొందరు మందుబాబులు తనిఖీ సమయంలో పోలీసులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారనే విమర్శలూ ఉన్నాయి.

ఇండియన్ ఆర్మీ నియామకాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి అర్బన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఆర్మీ నియామకాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెట్విన్ సీఈవో కె.మోహన్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనరల్ డ్యూటీకి 10వ తరగతి పాస్, అగ్నివర్, అగ్నివీర్ క్లర్కు, స్టోర్ కీపర్ టెక్నికల్‌కు ఇంటర్ లేదా ఐటీఐ లేదా పాలిటెక్నిక్ పాస్, అగ్నివీర్ ట్రేడ్‌మెన్‌కు 8 నుంచి పదో తరగతి పాస్ అయి ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు వచ్చే నెల 10వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 94405 73537, 70364 28762, 0877-2286921 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

నీట్ స్టడీ మెటీరియల్ సిద్ధం

తిరుపతి(విద్య), మార్చి 28(ఆంధ్రజ్యోతి): నీట్-2025కు సిద్ధమవుతున్న విద్యార్థుల కోసం స్టడీ మెటీరియల్‌ను సిద్ధం చేసినట్లు జేఈఈ, నీట్ ఫోరం తెలిపింది. 2004, 2005 ప్రశ్నపత్రాలు, సొల్యూషన్స్, స్టడీ మెటీరియల్, గ్రాండ్ టెస్ట్‌లు, ర్యాంక్ బూస్టర్లతో డిజిటల్ బుక్‌లెట్లను రూపొందించినట్లు వెల్లడించింది. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ డిజిటల్ బుక్‌లెట్లను మొబైల్ వర్షన్‌లో వాట్సప్ ద్వారా పొందవచ్చని వివరించింది. మరింత సమాచారం కోసం 9849016661కు వాట్సప్‌లో నీట్-2025 అని మెసేజ్ పంపించాలని సూచించారు.

కొనసాగుతున్న ప్రతిభా ఉత్సవాలు


ప్రతిభా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సంస్కృత యూనివర్సిటీలో చేపట్టిన జాతీయ సంస్కృత విద్యార్థుల ప్రతిభా ఉత్సవాలు కొనసాగుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. శనివారం నిర్వహించే ముగింపు సభలో విజేతలకు బహుమతులు అందజేస్తారు. శుక్రవారం సాయంత్రం భగవద్దుకం అనే నాటకాన్ని ప్రదర్శించారు. అనంతరం ప్రదర్శించిన నృత్య రూపకం ఆకట్టుకుంది. నిర్వాహకులు నాగరాజు, ఉదయ్‌హెగ్డే పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే ప్రజాదర్బార్

తిరుపతి అర్బన్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్జీఓ కాలనీలోని కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నారు. సమస్యలకు సంబంధించి ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించనున్నారు.

11న లాంగ్‌మార్చ్

శ్రీకాళహస్తి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): జాతీయ సంపద అయిన ప్రభుత్వాస్తులను ప్రైవేటీకరణను తక్షణమే నిలపాలంటూ ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి రామచంద్ర పిలుపునిచ్చారు. శుక్రవారం విజయవాడలో ఢిల్లీలో ఏప్రిల్ 11న జరిగే లాంగ్‌మార్చ్ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిన ధరలను నియంత్రించాలన్నారు.

పాడి రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


రైతులకు మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాని

చంద్రగిరి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): పాడి రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. నారావారిపల్లె క్లస్టర్ పరిధిలోని రైతులకు ' పశువులలో ఎద క్రమబద్ధీ కరణ పథకం అమలుపై అవగాహన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాడి రైతుల కోసం నారావారిపల్లె క్లస్టర్ పరిధిలోని ఎ.రంగంపేట నుంచి భీమవరం వరకు 103 గోకులం షెడ్ల ఏర్పాటుకు రూ.2.26 కోట్లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. 55 మంది రైతుల పశువులకు రూ.75 లక్షల నిధులు మంజూరు చేశారని తెలిపారు. పశువులకు వాటర్ స్టోరేజ్ కోసం తొట్టెల నిర్మాణానికి రూ.22.50 లక్షలతో నిర్మాణం పూర్తి చేయనున్నట్లు తెలిపారు. 1124 పశువులకు రూ.3.37 కోట్ల బీమా చేయించామన్నారు. ఉచితంగా లభించే పశువైద్య సేవలు, కృత్రిమ గర్భధారణ, పోషకాహార పథ కాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం రైతులకు ఉచితంగా మం దులు, రాయితీపై దాణా రసాయనాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జేడీ రవికుమార్, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ జేడీ ఉమామహేశ్వరి, నారావారిపల్లె పశువైద్యాధికారి డాక్టర్ వంశీ, ఎంపీడీవో వెంకటరత్నం, తహసీల్దార్ శివరామసుబ్బయ్య, సర్పంచ్ బొబ్బా లక్ష్మి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జై జగన్ అంటే కేసులు పెడతారా?

● చంద్రగిరి వైసీపీ ఇన్‌చార్జి మోహిత్‌రెడ్డి విమర్శ

తిరుపతిరూరల్, మార్చి28(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ ఎంపీపీగా తమ అభ్యర్థి గెలవడంతో జైజగన్ అంటే కేసులు పెడతారా అంటూ చంద్రగిరి వైసీపీ ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి విమర్శించారు. తుమ్మలగుంటలోని స్వగృహంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పోలీసులు ఖాకీ చొక్కా వేసుకుని రాజకీయాలు చేస్తున్నారని, ఎవరినో తృప్తి పరిచేందుకు తప్పుడు కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. తమ అభ్యర్థి గెలవడంతో టపాకాయలు కాల్చి, నినాదాలు చేస్తే.. శాంతిభద్రతలకు విఘాతం కలిగించారని కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికి తనపై నాలుగు కేసులు నమోదు చేశారని, మరో 40 పెట్టినా భయపడేది లేదన్నారు. తప్పుడు కేసులు కొనసాగిస్తే ఎస్పీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని, జిల్లా పర్యటనకు వచ్చే సీఎం, మంత్రులకు నిరసన తెలుపుతామన్నారు. రూరల్ ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ మాధవరెడ్డి, నేతలు దామినేటి కేశవులు, నరేష్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మ్యూజియాలను అభివృద్ధి చేయండి


జేడీజేకి వినతిపత్రాన్ని అందజేస్తున్న జాస్తి వీరాంజనేయులు

చంద్రగిరి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి, నాగార్జున కొండల మ్యూజియంలను అభివృద్ధి చేయాలని అఖిల భారత పంచాయతీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు, అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ జాస్తి వీరాంజనేయులు కోరారు. ఈ మేరకు బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర పురావస్తు శాఖ జాయింట్ డైరెక్టర్ జనరల్ (జె డీజీ) డాక్టర్ లూర్దు స్వామికి వినతిపత్రాన్ని అంద జేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మ్యూజియాల అభివృద్ధికి అదనపు నిధులను మంజూరు చేయాలని కోరారు. మ్యూజియంలలో గైడ్ సదుపాయం లేదని, డిస్ప్లే బోర్డులు, లైటింగ్ గ్యాలరీలను అభివృద్ధి చేయాలన్నారు. దీనిపై జాయింట్ డైరెక్టర్ జనరల్ స్పందిస్తూ తప్పకుండా అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

స్వల్పకాలిక కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో స్వల్పకాలిక కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు. ఏటా వేసవిలో నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనార్థం స్వల్పకాలిక కంప్యూటర్ కోర్సుల్లో శిక్షణఇచ్చి సర్టిఫికెట్ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. కనీసం 7వ తరగతి విద్యార్హత కలిగిన వారు ఈ కోర్సులను పూర్తిచేసి కంపెనీల్లో ఉద్యోగాలు సాధించవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు 9985129995, 7671887039లలో సంప్రదించవచ్చునని వెల్లడించారు.

కోర్సులు

- కంప్యూటర్ ఫండమెంటల్స్ (45 రోజుల శిక్షణ)
- ఆఫీస్ ఆటోమేషన్ (ఎం.ఎస్. ఆఫీస్), (45 రోజులు)
- సి, సి++ (2 నెలలు)
- హార్డ్‌వేర్, నెట్‌వర్కింగ్ (3 నెలలు)
- ఆటోకాడ్ (2 నెలలు)
- మల్టీమీడియా (3 నెలలు)
- పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ అడ్వాన్స్ మల్టీమీడియా అండ్ యానిమేషన్ (6 నెలలు)

సమన్వయంతో మంచి ఫలితాలు



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్యకుమారి

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 28(ఆంధ్రజ్యోతి): అన్ని శాఖల సమన్వయంతో ముందుకెళ్లాలని, అప్పుడే మంచి ఫలితాలు వస్తాయని రాష్ట్ర మహిళా శిశుసంక్షేమ శాఖ కార్యదర్శి సూర్యకుమారి అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం వివిధ అంశాలపై ఆమె సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో వందశాతం మౌలిక వసతులు ఉండేలా చూడాలన్నారు. కేంద్ర ప్రభుత్వం గుర్తించిన సుపోషిత్ పంచాయతీల్లో అన్ని సదుపాయాలు కల్పిస్తే గుర్తింపుతో పాటు రూ.లక్ష పారితోషికం వస్తుందని తెలిపారు. దివ్యాంగులకు నెల్లూరు సీఆర్సీ ద్వారా క్యాంపులు నిర్వహించి ట్రైసైకిల్, బ్యాటరీ సైకిల్ అందజేయాలన్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల ఆడపిల్లల ఆరోగ్యం పాడవుతుందని, ఎదుగుదల లేని పిల్లలు పుడతారని అన్నారు. పింక్ టాయిలెట్స్‌లో పురోగతి చూపుతామని తెలిపారు. అంతకు ముందు మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో మదర్ ఫీడింగ్ సెంటర్‌ను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో స్త్రీశిశు సంక్షేమ శాఖ ఆర్‌జేడీ రోహిణి, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి వసంతబాయి, డీఎస్పీ శ్రీలత, సీడీపీవోలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

వార్డు సభ్యుడి ఫిర్యాదుతో అవినీతిపై విచారణ


రికార్డుల పరిశీలనలో అధికారులు

రేణిగుంట, మార్చి 28, (ఆంధ్రజ్యోతి): జన సేన పంచా యతీ వార్డు సభ్యుడు మెహ బూబ్ బాషా ఫిర్యాదుతో శు క్రవారం పంచా యతీ కార్యాలయంలో తిరుపతి డీఎల్పీవో సురేష్ నాయుడు విచారణ చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో 2021 నుండి జరిగిన అభివృద్ధి కార్యక్రమాల్లో అవినీతి జరిగిందని కలెక్టర్ కార్యాలయంలో ప్రజా వేదికలో వార్డు సభ్యుడు ఫిర్యాదు చేయగా ఈ విషయం పై జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవి తిరుపతి డీఎల్పీవోను విచారించా ల్సిందిగా ఆదేశించారు. దీంతో ఆయన రికార్డులను పరిశీలించారు. శ్రీకాళహస్తి డీఎల్పీవో ప్రభు రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మణి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు అతిక్రమించినందుకే కేసులు

● చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్ స్పష్టీకరణ

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 28(ఆంధ్రజ్యోతి): 'తిరుపతి రూరల్ ఎంపీపీ ఎన్నికల సందర్భంగా ఎలక్షన్ కోడ్ ఉల్లంఘించినందుకే వైసీపీ నేతలపై కేసులు నమోదు చేశాం. అయితే, పోలీసులు టీడీపీ తరఫున పనిచేస్తున్నారని వారు నిరాధారమైన ఆరోపణలు చేయడం తగదు' అని చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పోలీసులు ఏ పార్టీకి కొమ్ము కాయరని, ప్రజలకు సేవ చేయడానికి మాత్రమే ఉన్నారని పేర్కొన్నారు. 'చట్టాన్ని అతిక్రమించి పోలీసులు ఎలాంటి కేసులు పెట్టరు. అందరూ చట్టానికి లోబడి పని చేస్తారన్న విషయాన్ని వారు గమనించాలి. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నపుడు నలుగురికి మించి వ్యక్తులు రోడ్లపై గుంపులుగా ఉండరాదు. ఎన్నికల ప్రక్రియ ముగిసిన తరువాత సంబరాలు చేసుకోరాదు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగించరాదని నిబంధనలున్నాయి. అయితే వైసీపీ నాయకులు, కార్యకర్తలు రోడ్లపై బాణసంచా కాల్చి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించడంతో వారిపై కసులు నమోదు చేశాం' అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. జై జగన్ అనే నినాదంపై కేసులు నమోదు చేయలేదని డీఎస్పీ ప్రసాద్ పేర్కొన్నారు. చట్టాన్ని అతిక్రమించిన వారిపైనే కేసులు నమోదు చేస్తామన్నారు. దీనిని వక్రీకరించి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పోలీసులపై నిరాధారమైన ఆరోపణలు చేయడం సమంజసం కాదన్నారు.

డిప్యూటీ సీఎం కుటుంబీకులపై అసభ్యకర పోస్టింగ్

● పోలీసులకు జనసేన ఫిర్యాదు


డీఎస్పీ ప్రసాద్‌కు ఫిర్యాదు చేస్తున్న జనసేన నాయకులు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 28(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కుటుంబ సభ్యులపై అసభ్యకర పోస్టింగ్‌లు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ శుక్రవారం చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్‌ను కలసి జనసేన నాయకులు ఫిర్యాదు చేశారు. కిరణ్ రాయల్ ఆధ్వర్యంలో జనసేన లీగల్ సెల్ కమిటీ నాయకులు డీఎస్పీని కలిశారు. అసభ్యకర పోస్టింగ్‌లు పెడుతున్న వారిపై 48 గంటల్లో చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కిరణ్‌రాయల్ డిమాండు చేశారు. లేదంటే అధికారంలో ఉన్నా.. తాము ఆందోళన చేస్తామని హెచ్చరించారు. డిప్యూటీ సీఎం, మంత్రి లోకేశ్‌పై వస్తున్న పోస్టింగ్‌లపై పోలీసులు నిఘా ఉంచి చర్యలు తీసుకోక పోవడం బాధాకరమని పేర్కొన్నారు.

తెలంగాణ ప్రజలకు మంచి దర్శనం చేయిస్తున్నారు

● చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి

తిరుమల, మార్చి28(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలు తీసుకుని టీటీడీ మంచి దర్శనం చేయిస్తోందని ఆ రాష్ట్ర శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి సంతోషం వ్యక్తంచేశారు. తిరుమల శ్రీవారిని శుక్రవారం ఉదయం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలపై ఈనెల 24వ తేదీ నుంచి దర్శనం కల్పిస్తుండటం చాలాసంతోషంగా ఉందన్నారు. తెలంగాణ ప్రజలు కూడా చాలా ఆనందంగా ఉన్నారన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలు ఇంకా అభివృద్ధి చెందాలని, స్వామి ఆశీస్సులతో ప్రజలందరూ బాగుండాలని కోరుకున్నట్టు చెప్పారు.

చిన్నశేషుడిపై శ్రీరాముడి తేజస్సు


చిన్నశేష వాహనంపై శ్రీరామచంద్రమూర్తి

తిరుపతి(టీటీడీ), మార్చి 28(ఆంధ్రజ్యోతి): కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రెండు వాహనాలపై శ్రీరామచంద్రమూర్తి విహరించి భక్తులను అనుగ్రహించారు. ఉదయం చిన్నశేష వాహనంపై కొలువుదీరిన స్వామివారు ఆలయ నాలుగు మాఢ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు ఆలయ ఆవరణలోని కల్యాణ మండపంలో సీతాలక్ష్మణ సమేత కోదండరామస్వామి ఉత్సవర్లకు శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి హంస వాహనాన్ని అధిష్ఠించిన స్వామివారు భక్తులకు దర్శనమిస్తూ మాఢ వీధుల్లో ఊరేగారు. వాహన సేవల ముందు కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పించారు. కార్యక్రమంలో చిన్న జీయర్ స్వామి, ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో రవి, సూపరింటెండెంట్ మునిశంకరన్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ పాల్గొన్నారు.


హంస వాహనంపై కోదండరాముడు

నిరుద్యోగులకు ఉపాధి కల్పించండి



మహాసభల లోగోను ఆవిష్కరిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

తిరుపతి(ఆటోనగర్), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): యువతకు ఉపాధి కల్పించి, దేశంలో పెరుగుతున్న నిరుద్యోగ సమస్య కు పరిష్కారం చూపాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామ కృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవా రం తిరుపతిలోని సీపీఐ కార్యాలయంలో ఆయన ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభల లోగోను ఆవిష్కరించారు. దేశంలో నిరుద్యోగుల సంఖ్య పెరుగుతోందన్నారు. ఏడాదికి రెండుకోట్ల ఉద్యోగాలు ఇస్తామని బీజేపీ ప్రభుత్వం పదేళ్ల క్రితం ఇచ్చిన హామీనీ నేటికీ అమలు చేయలేదన్నారు. యువతకు ఉపాధి కల్పనలో కేంద్రం విఫలమైందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా నిరుద్యోగ సమస్యపై దృష్టి సారించాలని కోరారు. తిరుపతిలో మే 15 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించే ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు ఎ.రామానాయుడు, పి.మురళి, సి.పెంచలయ్య, విశ్వనాథ్, కె.రవి, బి.చలపతి, ఎం.రామకృష్ణ పాల్గొన్నారు.

60 మంది రక్తదానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వేద వర్సిటీలో అరవై మంది విద్యార్థులు, ఉద్యోగులు రక్తదానం చేశారు. దాతలను వీసీ రాణి సదాశివమూర్తి, రిజిస్ట్రార్ భాస్కరుడు అభినందించారు. కార్యక్రమంలో స్విమ్స్ బ్లడ్ బ్యాంక్ టీం ప్రవీణ్, రాజేష్, భరతశేఖరాచార్యులు, నీలకంఠం, పీఆర్వో బ్రహ్మాచార్యులు పాల్గొన్నారు.

వ్యవసాయ అంకుర సంస్థలకు నిధులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): 20 వ్యవసాయ అంకుర సంస్థలకు రూ.80 లక్షల నిధులను తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం (ఆర్ఏఆర్ఎస్) అందజేసింది. ఒప్పంద పత్రాలపై ఆయా సంస్థల ప్రతినిధులు, అధికారులు శుక్రవారం సంతకాలు చేశారు. 20 సీడ్ స్టార్టప్‌లకు ఒక్కో స్టార్టప్‌కు రూ.5 లక్షల నిధులు అందించారు. వీసీ శారద జయలక్ష్మి వర్చువల్ విధానంలో హాజరై మాట్లాడారు. వర్సిటీ రీసెర్చ్ డైరెక్టర్ సత్యనారాయణ, ఆర్ఏఆర్ఎస్ ఏడీ సుమతి, ప్రాజెక్టు ఆఫీసర్ కదిరి మోహన్ తదితరులు పాల్గొన్నారు. వ్యవసాయ రంగంలో మార్పులు తీసుకురావడానికి ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు.

అన్నమయ్య కీర్తనలతో సామాజిక, ఆధ్యాత్మిక చైతన్యం



మాట్లాడుతున్న కృష్ణవేణి

తిరుపతి (కల్చరల్), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): సమాజంలో విలువలను పునరుద్ధరించి, సామాజిక, ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందించేందుకు అన్నమయ్య సంకీర్తనలు ఎంతగానో దోహదపడతాయని ఎస్వీ విశ్వవిద్యాల యం విశ్రాంతాచార్యులు సర్వోత్తమరావు పేర్కొన్నారు. అన్నమాచార్యుల 522 వర్ధంతి ఉత్సవాల్లో భాగంగా తిరుపతిలోని అన్నమాచార్య కళామందిరంలో శుక్రవారం సాహితీ సదస్సు రెండో రోజుకు చేరుకుంది. పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల తెలుగు అధ్యాపకురాలు కృష్ణవేణి అన్నమయ్య సంకీర్తనలు, పురాణ గాథలు అనే అంశంపై, జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టర్ నల్లన్న పోతన్న అన్నమయ్య అనే అంశంపై ప్రసంగించారు. అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు వాయిద్య, గాత్ర సంగీతం నిర్వహించారు. టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు ఇన్‌చార్జి సంచాలకులు రాజగోపాలరావు పాల్గొన్నారు.

రికార్డు అసిస్టెంట్ శ్రీనివాసులునాయక్ మృతి



శ్రీనివాసులు నాయక్ (ఫైల్ ఫోటో)

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ హోంసైన్స్ విభాగ రికార్డు అసిస్టెంట్ బి.శ్రీనివాసులు నాయక్ (52) మృతి చెందారు. కడప జిల్లా పులివెందులకు చెందిన శ్రీనివాసులు నాయక్ చాలా ఏళ్ళుగా యూనివర్సిటీలో పని చేస్తున్నారు. కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ ఉన్నారు. యూనివర్సిటీ క్వార్టర్స్‌లో శుక్రవారం మృతి చెందారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు. అక్కడే అంత్యక్రియలు శనివారం నిర్వహించనున్నారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. శ్రీనివాసులునాయక్ మృతికి సంతాప సూచకంగా శనివారం సైన్స్ కాలేజీ పరిధిలోని విభాగాలకు సెలవు ప్రకటించారు.

మా భూమిని మాకు ఇప్పించాలి

తిరుపతి(కల్చరల్), మార్చి 28(ఆంధ్రజ్యోతి): 40 ఏళ్లుగా తమకు సంక్రమించిన వ్యవసాయ భూమిని తప్పుడు రిజిస్ట్రేషన్‌తో కొందరు కాజేశారని బీఎన్ కండ్రిగ మండలం నీర్పాకోట గ్రామానికి చెందిన రైతు వెంకటరమణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ బత్తల లక్ష్మయ్య 2019లో అధికారులకు డబ్బులు ఇచ్చి తమ భూమిని ఆయన పేరుపై రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని ఆరోపించారు. దీనిపై సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, కలెక్టర్ వెంకటేశ్వర్ దృష్టికి తీసుకెళ్లినా అధికారులు తప్పుడు సమాచారాలతో తమ భూమిని తమకు చెందకుండా చేస్తున్నారని అన్నారు. దీనిపై కోర్టులో కేసు నడుస్తుండగా తమ భూమిని లక్ష్మయ్య మరొకరికి విక్రయించారని, పోలీసులు సైతం తమ ఫిర్యాదు పట్టించుకోవడం లేదని ఆవేదన చెందారు.

'బంధువులే భూమి కాజేయాలని చూస్తున్నారు'

తిరుపతి(కల్చరల్), మార్చి 28(ఆంధ్రజ్యోతి): బీఎన్ కండ్రిగ మండలం గాజులపెళ్లూరు గ్రామంలోని తమ భూమిని భర్త విజయశేఖర్ మేనత్త సుభాషిణి, వారి కుమారులు కాజేయాలని ప్రయత్నిస్తున్నారని సురేఖ ఆరోపించింది. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఆమె మాట్లాడుతూ తమ కుటుంబానికి పిత్రార్జితంగా వచ్చిన భూమికి సంబంధించిన పత్రాలను ఇంట్లో నుంచి కాజేసి తిరుపతిలోని ఓ ఆసుపత్రి నిర్వాహకులకు చేర్చారని ఆరోపించారు. దీనిపై తాము పోరాటం చేస్తుంటే వెదురుకుప్పంకు చెందిన గాలి పృథ్వీరాజ్ అనే వ్యక్తితో కలిసి తమపై దాడికి దిగుతున్నారని, గతంలోనూ దాడులు చేశారని అన్నారు. అధికారులు తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

నేడు తిరుపతి టౌన్‌బ్యాంక్ మహాజన సభ

తిరుపతి(ఆటోనగర్), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తిరుపతి టౌన్‌బ్యాంక్ మహాజన సభ శనివారం ఉదయం 10 గంటలకు బ్యాంక్ ప్రధాన కార్యాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు ఆ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ వి.శివకుమార్‌రెడ్డి తెలిపారు. 63 వేల మంది వాటాదారులు హాజరుకావాలని కోరారు. డివిడెండ్ పంపిణీ, ఇతర అంశాలపై చర్చ జరుగుతుందని వివరించారు.

సమావేశాలను వినియోగించుకోండి



సమస్యలు తెలుసుకుంటున్న చంద్రశేఖరరావు

తిరుపతి (ఆటోనగర్) మార్చి 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సౌలభ్యం కోసం సంస్థ నిర్వహించే సమావేశాలను ఉపయోగించుకోవాలని తిరుపతి టౌన్ డివిజన్ ఈఈ వి.చంద్రశేఖరరావు కోరారు. తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ పరిధిలోని పాడిపేట సబ్ స్టేషన్‌లో శుక్రవారం వినియోగదారుల సమావేశం నిర్వహించారు. రైతులు, వినియోగదారులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. డీఈఈ జయప్రకాష్, ఏఈ శ్రీనివాసుల నాయుడు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి(ఆటోనగర్), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ శ్రీనివాసం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ తీగల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 11.30 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్ డివిజన్ ఈఈ వి.చంద్రశేఖరరావు తెలిపారు. చింతలచేను, డీబీఆర్ రోడ్డు, సంజయ్‌గాంధీ కాలనీ, టీపీ ఏరియా, పెద్ద, చిన్న కాపు వీధులు, రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, బండ్లవీధి, విష్ణునివాసం, పీఎల్ఆర్ గ్రాండ్ తదితర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

తిరుపతి

టీటీడీ స్థానికాలయాల్లో ఉగాది వేడుకలు

తిరుపతి(కల్చరల్), మార్చి 28(ఆంధ్రజ్యోతి): టీటీడీ స్థానికాలయాల్లో ఈ నెల 30న ఉగాది వేడుకలు వైభవంగా నిర్వహించనున్నారు. గోవిందరాజస్వామి ఆలయంలో ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తోమాల, కొలువు, పంచాంగ శ్రవణం, అర్చన నిర్వహిస్తారు. సాయంత్రం 4.30 నుంచి 6 గంటల వరకు ఉగాది ఆస్థానం ఉంటుంది. ● కోదండరామాలయంలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉగాది ఆస్థానం, పంచాంగ శ్రవణం జరుగుతుంది. జీయర్ స్వాములు మూలవర్లకు, ఉత్సవర్లకు వస్త్ర సమర్పణ చేస్తారు. ● తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. సాయంత్రం 6 నుంచి 7.30 గంటల వరకు పుష్పపల్లకిలో అమ్మవారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులను కటాక్షిస్తారు. రాత్రి 8 నుంచి 8.30 గంటల వరకు పంచాంగ శ్రవణం ఉంటుంది. ● కార్వేటినగరం వేణుగోపాలస్వామి ఆలయంలో ఉదయం 4 గంటలకు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి, తోమాల, కొలువు, పంచాంగ శ్రవణం, అర్చన నిర్వహిస్తారు. సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు ఆలయంలో ఉగాది ఆస్థానం, పంచాంగ శ్రవణం, 5.30 నుంచి 7.30 గంటల వరకు తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు. ● అప్పలాయగుంట ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు పంచాంగ శ్రవణం, ఉగాది ఆస్థానం నిర్వహిస్తారు.

ముస్లింలకు ఎమ్మెల్యే ఇఫ్తార్ విందు



ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి అర్బన్, మార్చి 28(ఆంధ్రజ్యోతి) : ముస్లింలకు శుక్రవారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఆర్సీ రోడ్డులోని షాదిమహల్లో సాయంత్రం ప్రార్థనల అనంతరం విందు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లింలకు అల్లా ఆశీస్సులు మెండుగా ఉండాలని ఆకాంక్షించారు. మైనార్టీల సంక్షేమానికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కట్టుబడి ఉన్నారని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి, కార్పొరేటర్లు ఎస్కే బాబు, నరసింహాచారి, అన్నా అనిత యాదవ్, వరికుంట్ల నారాయణ, మహబూబ్‌బాషా, నసరుద్దీన్, అర్షద్, ఆర్కాట్ కృష్ణప్రసాద్, కేఎంకే లోకేశ్, ఊస మాధవరావు, రాజేష్‌యాదవ్, శాంతాదేవి, శిరీష, రాధా తదితరులు పాల్గొన్నారు.

పద్మావతి కాలేజీ వార్షికోత్సవం



ప్రసంగిస్తున్న పద్మావతి వర్సిటీ వీసీ ఉమ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా డిగ్రీ కాలేజీ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కాలేజీ ప్రాంగణంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో పద్మావతి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులు కాలేజీ ఖ్యాతిని పెంచేలా మెలగాలన్నారు. టీటీడీ పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యలకు భయపడి వెనకడుగు వేయొద్దన్నారు. ఏ రంగంలో రాణించినా తల్లిదండ్రులు, గురువును మరువరాదన్నారు. ప్రిన్సిపాల్ నారాయణమ్మ వార్షిక నివేదికను సమర్పించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

నేడు ఉగాది పురస్కారాల ప్రదానం

తిరుపతి(కల్చరల్), మార్చి 28(ఆంధ్రజ్యోతి): శ్రీసిటీ ఆధ్యాత్మిక సాహిత్య వేదిక ఆధ్వర్యంలో శనివారం ఉదయం 11 గంటలకు శ్రీసిటీలోని బిజినెస్ సెంటర్‌లో ఉగాది పురస్కారాల ప్రదానోత్సవం జరగనుంది. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారికి పురస్కారాలు ప్రదానం చేయనున్నారు.

'సర్వదేవతా ప్రార్థన శ్లోకాలు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీలు రాణిసదాశివమూర్తి, కృష్ణమూర్తి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ బాలిరెడ్డి సంకలనం చేసిన సర్వ దేవతా ప్రార్థనా శ్లోకాలు పుస్తకాన్ని వేద వర్సిటీ వీసీ రాణిసదాశివమూర్తి, సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్, ఎస్టీఎఫ్ ఎస్పీ శ్రీనివాస్, విభీషణ శర్మ ఆవిష్కరించారు. వేద వర్సిటీలో శుక్రవారం ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈపుస్తకంలో ఎన్నో విలువైన శ్లోకాలు ఉన్నాయని తెలిపారు. సంకలనకర్త బాలిరెడ్డిని అభినందించారు.

సమస్యలు పరిష్కరించండి సారూ..



మోకాళ్లపై నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు కార్మికులు

తిరుపతి(ఆటోనగర్), మార్చి28 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు చేపట్టిన దీక్షల్లో భాగంగా శుక్రవారం మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. దీర్ఘకాలంగా పెండింగ్ ఉన్న సమస్యలు పరిష్కరించాలని ఐదు రోజులుగా దీక్ష చేస్తుంటే అధికారుల్లో స్పందన లేకపోవడం అన్యాయమని పుత్తూరు డివిజన్ నాయకులు మురళి అన్నారు.

దుస్థితిలో మంగళం ఆర్టీసీ డిపో

పేరుకున్న వ్యర్థాలు, శిథిలమవుతున్న వాహనాలు





పేరుకున్న వాటర్ బాటిళ్లు, బస్సు విడిభాగాల కుప్పలు - శిథిలావస్థలో ఉన్న అటవీశాఖ వాహనాలు

తిరుపతి(ఆర్టీసీ), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ మంగళం డిపో దుస్థితిలో ఉంది. ఒకవైపు వ్యర్థాలు, మరో వైపు ఆర్టీఏ విభాగం వాహనాలు శిథిలమై కళావిహీనంగా కనిపిస్తోంది. తనిఖీల్లో ఆర్టీఏకు పట్టుబడిన వాహనాలను కొన్నేళ్ల క్రితం మంగళం డిపోలో ఉంచారు. తర్వాత వాటిని పట్టించుకోకపోవడంతో దాదాపు ఎనిమిది వాహనాలు పూర్తిగా పాడైపోయాయి. తుప్పుపట్టి భాగాలు ఊడిపోయాయి. టైర్లు భూమిలోకి కుంగిపోయాయి. మరో మూలలో ఆర్టీసీ బస్సులకు వినియోగించిన విడిభాగాలు, వాటర్‌బాటిల్స్ కుప్పలు తెప్పలుగా పడేశారు. మరో మూలలో చెట్ల ఆకులు, కొమ్మలు, పిచ్చికాగితాలు, ఇతర వ్యర్థాలు పేరుకుపోయాయి. తక్షణమే డిపో శుభ్రతకు కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

ఘనంగా ఉగాది వేడుకలు



బహుమతులు అందుకున్న కవులు, రచయితలు

తిరుపతి(కల్చరల్), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తిరుపతి సాహితీ సంస్థల ఆధ్వర్యంలో బైరాగిపట్టెడలోని రాఘవేంద్రనగర్‌లో గల కల్యాణ మండపంలో శుక్రవారం విశ్వావసు ఉగాది వేడుకలు అట్టహాసంగా నిర్వహించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న శతావధాని ఆముదాల మురళి మాట్లాడుతూ తెలుగు జాతికి తొలి పండుగ ఉగాది అని, ప్రకృతిలో వచ్చిన మార్పులకు అనుగుణంగా ఈ సంవత్సరం ప్రారంభమవుతుందని అన్నారు. ఇందులో భాగంగా ఇటీవల నిర్వహించిన ఉగాది కవి సమ్మేళనంలో ప్రతిభచాటిన ఐదుగురు కవులు రవి, గొల్లాపిన్ని సుబ్రహ్మణ్యం, ధర్మయ్య, ధర్మరాజు, మహేష్‌బాబులను సత్కరించారు. సంప్రదాయ వస్త్రధారణలో ఐదుగురిని ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. టీటీడీ ధర్మప్రచార పరిషత్ కార్యదర్శి శ్రీరామ్ రఘునాథ్, గార్లపాటి దామోదర నాయుడు, తోట వెంకటేశ్వర్లు, తిరుపతి రచయితల సంఘం, తెలుగు భాషోద్యమ సమితి, అభ్యుదయ రచయితల సంఘం, ఈతరం కవితా వేదిక, విశ్వశ్రీ సాహితీ సమాఖ్య, శంకరంబాడి సాహితీ పీఠం, వేంకటేశ్వర రసజ్ఞ సమాఖ్య, వేమన విజ్ఞాన కేంద్రం, మానవ వికాస వేదిక, రాజాచంద్ర ఫౌండేషన్, సాహితీ స్రవంతి సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

ఏప్రిల్‌లో గోవిందరాజస్వామి ఆలయంలో విశేష ఉత్సవాలు

తిరుపతి(టీటీడీ), మార్చి 28(ఆంధ్రజ్యోతి): గోవిందరాజస్వామి ఆలయంలో ఏప్రిల్ నెలలో విశేష ఉత్సవాలు జరగనున్నాయి. 3న రోహిణి నక్షత్రం సందర్భంగా సాయంత్రం 6 గంటలకు రుక్మిణి, సత్యభామ సమేత పార్థసారథి స్వామి మాడ వీధుల్లో భక్తులను కటాక్షిస్తారు. 4, 18 తేదీల్లో సాయంత్రం 6 గంటలకు ఆండాళ్ అమ్మవారిని ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగిస్తారు. 6న శ్రీరామనవమి సందర్భంగా సీత, లక్ష్మణ, ఆంజనేయ సమేత పట్టాభిరామ స్వామి మాడ వీధుల్లో భక్తులకు అభయమిస్తారు. 12న పౌర్ణమి, ఉత్తర నక్షత్రం సందర్భంగా సాయంత్రం గరుడ వాహన సేవ ఉంటుంది. 22న శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని సాయంత్రం 6 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామివారు ఊరేగుతారు. 23 నుంచి మే 2వ తేదీ వరకు భాష్యకార్ల ఉత్సవం నిర్వహించనున్నారు.

12న త్రిమూర్తుల కల్యాణం



ఆహ్వాన పత్రికలు విడుదల చేస్తున్న నిర్వాహకులు

తిరుపతి(కల్చరల్), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): చైత్ర పౌర్ణమి సందర్భంగా గాజుల మండ్యంలోని మూలస్థానేశ్వర స్వామివారి ఆలయంలో ఏప్రిల్ 12వ తేదీన త్రిమూర్తుల కల్యాణం నిర్వహించనున్నట్లు ఏకవీర ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ స్వామి పేర్కొన్నారు. శుక్రవారం తాతయ్యగుంటలో త్రిమూర్తుల కల్యాణ ఆహ్వాన పత్రికలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ తొలిసారిగా నిర్వహించే ఈ వేడుకకు భక్తులు హాజరుకావాలని కోరారు.

చిత్తూరు నాగయ్యకు నివాళి

తిరుపతి(కల్చరల్), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మహానటుడు చిత్తూరు నాగయ్యకు రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో శుక్రవారం నివాళులర్పించారు. తిరుపతిలో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి సమర్పించారు. కార్యక్రమంలో గుండాల గోపినాథ రెడ్డి, రాజా, సుబ్రహ్మణ్యం రెడ్డి, రాజశేఖరరెడ్డి, కల్యాణి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

4న నరసింహ యాదవ్‌కు సన్మానం

తిరుపతి(కల్చరల్), మార్చి 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్‌గా ఏప్రిల్ 2వ తేదీన ప్రమాణస్వీకారం చేయనున్న గొల్ల నరసింహ యాదవ్‌కు అదేనెల 4వ తేదీన సన్మానం చేయనున్నట్లు యాదవ సంఘం నాయకుడు కట్టా జయరాం యాదవ్ తెలిపారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ బాలాజీకాలనీలోని జ్యోతిరావుపూలే విగ్రహం నుంచి తుడా కార్యాలయం వరకు ర్యాలీ ఉంటుందని, కచ్చపి ఆడిటోరియంలో సన్మాన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. తిరుపతి ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మహేష్ యాదవ్, అశోక్ సామ్రాట్ యాదవ్, హేమంత్ కుమార్ యాదవ్, భరణి యాదవ్, రవి శంకర్ యాదవ్, వెంకటాద్రి యాదవ్, సుబ్రహ్మణ్యం యాదవ్ పాల్గొన్నారు.

నేడు మహతిలో గుడి సంబరాలు

తిరుపతి(కల్చరల్), మార్చి 28(ఆంధ్రజ్యోతి): పరంపర ఫౌండేషన్ ఆధ్వర్యంలో తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో శనివారం గుడి సంబరాల పేరుతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వ్యవస్థాపకుడు ప్రమోద్ తెలిపారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ రామ లీలలు, హనుమంతుని భక్తి, హనుమాన్ చాలీసా, వాయుస్తుతి, వందనం రఘునందన, నారసింహ స్తుతిపై నాట్యంతో కూడిన ప్రదర్శనలు ఉంటాయన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న సీఐ తమీమ్ అహ్మద్

తిరుపతి అర్బన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ ఎం.తమీమ్‌అహ్మద్ ఆకాంక్షించారు. నవభారత్ సేవా సమాజం ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ కాలనీలో ఏర్పాటు చేసిన మహిళల ఉచిత నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. మహిళలు సామాజికంగా, ఆర్థికంగా బలోపేతం కావడానికి ఈ కేంద్రాలు సహాయపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో నవభారత్ సేవాసమాజ్ సంస్థ అధ్యక్షుడు కె.ఆర్.వెంకటాచలం, ప్రధాన కార్యదర్శి రహంతుల్లా, జీవ, లావణ్య, సుజాత, లలిత, సుమతి, కవిత తదితరులు పాల్గొన్నారు.

శబ్ద మీమాంసపై ముగిసిన వర్క్‌షాప్



కుటుంబశాస్త్రిని సన్మానిస్తున్న నిర్వాహకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా సంస్కృత యూనివర్సిటీలో శబ్ద మీమాంస అంశంపై నిర్వహించిన వర్క్‌షాప్ శుక్రవారం ముగిసింది. ముగింపు సభలో రాష్ట్రీయ సంస్కృత సంస్థ మాజీ ఛాన్స్‌లర్ వెంపటి కుటుంబ శాస్త్రి పాల్గొని మాట్లాడారు. శారదబోతు గొప్పతనాన్ని క్రియాన్వయాన్ని భాషా ప్రయోగంలో ఉపయోగించాలన్నారు. విశిష్టాద్వైతం హెడ్ దేవనాథన్ మాట్లాడుతూ శబ్ద బోధన ద్వారా ప్రతి పదం అర్థాన్ని స్పష్టంగా నిర్వచించే సామర్థ్యం వస్తుందన్నారు. డీన్ విష్ణుభట్టాచార్యులు మాట్లాడుతూ ఈ వర్క్‌షాప్ విజయవంతంగా సాగిందన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ప్రొఫెసర్ రంగనాథన్, డాక్టర్ కల్యాణ్‌శాస్త్రి, పలు ప్రాంతాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రీజనల్ సైన్స్ సెంటర్‌లో రోబో ట్రాక్ పోటీలు

మంగళం, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రీజనల్ సైన్స్ సెంటర్‌లో శుక్రవారం రాధాకృష్ణ ఎడ్యుకేషన్ సొసైటీ సహకారంతో ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ విద్యార్థులకు రోబో ట్రాక్ 2.0 పోటీలను నిర్వహించారు. తిరుపతి, ఒంగోలు, బెంగళూరుకు చెందిన ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ విద్యార్థులు పాల్గొన్నట్లు సైన్స్ సెంటర్ రీజనల్ కోఆర్డినేటర్ శ్రీనివాస నెహ్రూ తెలిపారు. విద్యార్థులు రోబోట్లను తయారు చేశారని, శనివారం ట్రాక్‌పై నడుపుతారని చెప్పారు. విజేతలను నిర్ణయించి బహుమతులు అందజేస్తామని తెలిపారు.

పట్టించుకోండి సారూ..!

ట్రాన్స్‌ఫార్మర్‌ను కమ్మేసిన కంపచెట్లు



ట్రాన్స్‌పార్మర్‌ను కమ్ముకున్న కంపచెట్లు

తిరుపతి అర్బన్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): శెట్టిపల్లి గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌పార్మర్‌ను కంపచెట్లు కమ్మేశాయి. విద్యుత్ తీగలకు చెట్లు, కొమ్మలు తాకుతుండడంతో తరచూ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. ప్రతి శనివారమూ చెట్ల కొమ్మల తొలగింపు పేరుతో సరఫరాను నిలిపేసే విద్యుత్ అధికారులకు ఇది కనిపించడం లేదా అని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించాల్సి ఉంది.

బహుమతి ఇప్పించండి ప్లీజ్..!



శాప్ చైర్మన్‌ను కలసిన కార్తీక్‌వెంకటరామన్

తిరుపతి(క్రీడలు), మార్చి 28 (ఆంధ్రజ్యోతి): గతంలో రెండుసార్లు, గతేడాది ఆగస్టులో గుర్గావ్‌లో జరిగిన 61వ నేషనల్ చెస్ చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచిన తనకు పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ బహుమతి ఇప్పించాలని బైరాగిపట్టెడకు చెందిన చెస్ గ్రాండ్ మాస్టర్ కార్తీక్ వెంకటరామన్ శాప్ చైర్మన్ రవినాయుడిని కోరారు. శుక్రవారం శ్రీనివాస క్రీడా సముదాయంలో కార్తీక్‌వెంకటరామన్ శాప్ చైర్మన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి తాను సాధించిన విజయాలను వివరించారు. ప్రభుత్వ నగదు బహుమతి(రూ.14.5లక్షలు) త్వరగా అందించేలా చర్యలు తీసుకోవాలని డీఎస్‌డీవో సయ్యద్‌సాహెబ్‌ను శాప్ చైర్మన్ ఆదేశించారు.

నగరి సమస్యలు పరిష్కరించండి



తిరుపతి(కలెక్టరేట్), మార్చి 28 (ఆంధ్రజ్యోతి) : నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ శుక్రవారం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిశారు. కలెక్టరేట్‌లో ఆయన్ను కలిసి నియోజకవర్గంలో సమస్యలపై చర్చించారు. నిధులు మంజూరు చేసి, సహకరించాలని కోరారు.



తిరుమలలో 'రాబిన్‌హుడ్'

తిరుమల, మార్చి28(ఆంధ్రజ్యోతి): 'రాబిన్‌హుడ్' సినిమా హీరో నితిన్ శుక్రవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. తన సినిమా విడుదల సందర్భంగా శ్రీవారిని దర్శించుకుని ఆశీస్సులు తీసుకున్నట్లు చెప్పారు. ఈ సినిమాను అందరూ చూసి ఎంజాయ్ చేయాలని కోరారు. తన తర్వాత చిత్రం 'తమ్ముడు' మే లేదా జూన్ నెలలో విడుదల కానుందన్నారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డితో కలిసి వచ్చిన నితిన్‌కు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించగా, వేదపండితులు ఆశీర్వచనం చేశారు. ఆలయం ముందు నితిన్‌ను చూసేందుకు, సెల్ఫీల కోసం పలువురు ఉత్సాహం చూపారు.








శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. డీఆర్‌డీవో మాజీ చైర్మన్, ఏపీ శాస్త్ర సాంకేతిక సలహాదారు సతీష్‌రెడ్డి, ఎమ్మెల్సీ అశోక్‌బాబు, ఎన్‌ఎస్జీ డీజీ బ్రిగు శ్రీనివాసన్ ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

శ్రీవారి సర్వదర్శనానికి 13 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 13 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకున్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 28 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.4.36 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 64,279

తలనీలాలు సమర్పించినవారు: 24,482

నామినేటెడ్ ఆశలు

- జాబితాలతో సిద్ధమైన టీడీపీ, జనసేన
- కరువైన ఏకాభిప్రాయం
- నేడు విజయవాడకు తుది జాబితా?

తిరుపతి- ఆంధ్రజ్యోతి


మూడో విడత నామినేటెడ్ పదవుల జాబితాపై తిరుపతిలోని కూటమి పార్టీల నాయకులు పెద్దఎత్తున ఆశలు పెట్టుకున్నారు. జాబితా కసరత్తులో స్థానిక నాయకత్వం మల్లగుల్లాలు పడుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా నామినేటెడ్ పదవులను ఉగాదికి అటు, ఇటుగా విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. తుడా చైర్మన్ పీఠంపై అధిష్ఠానందే తుది నిర్ణయం కాబట్టి ఆశావహులు మౌనందాల్చారు. తక్కిన ఆలయాల పాలక మండళ్లు, టీటీడీ ధార్మిక సలహా మండళ్లతో పాటు వివిధ శాఖలకు సంబంధించి నామినేటెడ్ పదవుల జాబితాపై కసరత్తు తుది దశకు చేరుకుంది. నగరంలో ప్రధానంగా దేవదాయశాఖకు చెందిన ప్రసిద్ధ ఆలయం తాతయ్యగుంట గంగమ్మ దేవస్థానం చైర్మన్‌కు పోటీనెలకొంది. తాళ్లపాక పెదగంగమ్మ, వేశాలమ్మ, అంకాళమ్మ, రామాలయం పాలకమండళ్ల జాబితా దాదాపుగా సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. టీడీపీ, జనసేన నుంచి పోటాపోటీగా పదవులు ఆశిస్తున్నట్టు కనిపిస్తోంది.

ఎవరి జాబితాలు వారివి

స్థానికాలయాల పాలకమండళ్ల కోసం జనసేన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తన అనుచర వర్గానికి నామినేటెడ్ పదవులను కేటాయించేందుకు ఆసక్తి చూపుతూ జాబితా సిద్ధం చేశారన్న ప్రచారం జరుగుతోంది. మరోవైపు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగుణమ్మ తన అనుచరవర్గంతో జాబితా సిద్ధంచేసి ప్రభుత్వానికి పంపే ఏర్పాట్లు చేస్తున్నట్టు సమాచారం. ఉదాహరణకు గంగమ్మ ఆలయ పాలకమండలిలో 11 మంది సభ్యులుంటే టీడీపీ, జనసేనకు ఐదుగురు చొప్పున, బీజేపీకి ఒకరిని కేటాయించాలని మెజారిటీ నాయకుల అభిప్రాయంగా కనిపిస్తోంది. అయితే టీడీపీ, జనసేన ముఖ్య నాయకులు మాత్రం తమకంటే తమకు ఎక్కువ సభ్యులు కావాలని పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది. వాటా సంగతి అటుంచితే ఎవరికివారు జాబితాను తయారు చేసి పంపేందుకు సిద్ధమవుతున్నట్టు తెలిసింది. గంగమ్మ ఆలయ చైర్మన్ విషయంలో ఇరు నేతల మధ్య బేధాభ్రియాలు రావడం వల్లే రెండు జాబితాలకు తెరలేచినట్టు సమాచారం. రెండు రోజుల క్రితం సుగుణమ్మ నివాసంలో జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో టీడీపీ కార్యాలయం నుంచే తుది జాబితా పంపాలని ఆపార్టీ నేతలు కొందరు ఒత్తిడి తీసుకొచ్చారు. సిద్ధంచేసిన జాబితాలను ఎవరికి వారు విజయవాడకు పంపేపనిలో ఉన్నట్టు తెలిసింది.

ఏకాభిప్రాయంతోనే అందరికీ న్యాయం

ఇక టీటీడీకి చెందిన ధర్మప్రచార పరిషత్, ఎస్వీబీసీ కమిటీలోను సీనియర్లకు చోటుకల్పించేందుకు ఎమ్మెల్యే పట్టుబడుతున్నట్టు తెలుస్తోంది. రాష్ట్ర ఉద్యోగ సంఘాల మాజీ నేతతో పాటు మాజీ పోలీస్ అధికారి పేరు వినిపిస్తోంది. ఎన్నికల ముందు పార్టీ విజయానికి కృషిచేసిన సీనియర్లను గుర్తింపు ఇస్తే కేడర్‌లో నమ్మకం కుదురుతుందన్న ఆలోచనతో జనసేన నాయకత్వం ఉన్నట్టు తెలుస్తోంది. సీనియర్లకు తొలి రెండేళ్లు అవకాశం ఇచ్చి తర్వాత రెండేళ్లు యువతకు చోటుకల్పించాలన్న యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. అభిప్రాయ బేధాలు లేకుండా నిర్ణయం తీసుకుంటే విజయం కోసం పనిచేసిన వారికి న్యాయం దక్కుతుందని కూటమి వర్గాలు పేర్కొంటున్నాయి.



శ్రీసిటీలో నేడు ఉగాది పురస్కారాల ప్రదానం

శ్రీసిటీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తెలుగు సంవత్సరాది ఉగాదిని పురస్కరించుకుని శ్రీసిటీలోని ఆధ్యాత్మిక సాహిత్య వేదిక 'శ్రీవాణి' ఆధ్వర్యంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులకు పురస్కారాలను అందజేయనున్నారు. వారిలో ప్రముఖ అవధాన కవి డాక్టర్ నరాల రామారెడ్డి, పురావస్తు పరిశోధకుడు, స్థపతి డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి, సినీ చరిత్రకారుడు ఎస్వీ రామారావు, సంగీత విధూషీమణి రాణీ నాగశ్రీ శైలేశ్వరి, చమత్కారోపన్యాసకుడు ప్రాస మణి ఉన్నారు. వీరికి స్థానిక బిజినెస్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన ఉగాది వేడుకల కార్యక్రమంలో శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి పురస్కారాలను అందజేయనున్నారు.



డాక్టర్ నరాల రామారెడ్డి: కడపజిల్లా ప్రొద్దుటూరుకు చెందిన అవధాన కవి.



ఈమని శివనాగిరెడ్డి: తెనాలికి చెందిన ఈయన ప్రస్తుతం హైదరాబాద్‌లో స్థిరపడి తెలంగాణ ప్రభుత్వ చారిత్రక దేవాలయాలకు పరిశోధకుడిగా, సలహాదారుగా ఉన్నారు. చారిత్రక, దేవాలయాలపై సుమారు 500 పుస్తకాలు రచించారు.



ఎస్వీ రామారావు: ఈయన సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తూ 1998లో పదవీవిరమణ పొందారు. తన 13వ ఏట నుంచి నాటకాలపై మక్కువతో ఎన్నో ప్రదర్శనలు చేశారు. ముఖ్యంగా తెలుగు సినీ పరిశ్రమకు చారిత్రక పరిశోధకుడు. నంది అవార్డులు కూడా వరించాయి.



రాణి నాగశ్రీ శైలేశ్వరి: సంగీతంపై ఆమెకు మక్కువ ఎక్కువ. ఆ మక్కువతో సంగీత రంగంలో సంగీత విదూషీమణిగా తిరుపతి మహిళా యూనివర్శిటీలో సంగీతశాఖకు విభాగాధిపతిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.



ప్రాస మణి: ఈయన చమత్కారోపన్యాసకుడు. నెల్లూరు జిల్లా కావలికి చెందిన ఈయన అసలు పేరు అన్నదాత సుబ్రహ్మణ్యేశ్వరరావు. కామర్స్‌లో పాఠాన్ని ప్రాసగా చెప్పడంలో దిట్ట. ఏపీలోనే తెలుగుభాష, సంస్కృతి, హైందవ తెలుగు సంస్కృతుల మీద ప్రావీణ్యం, పట్టున్న వ్యక్తి.

హత్యాయత్నం కేసులో ఫీల్డ్ అసిస్టెంట్ అరెస్ట్

సత్యవేడు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): వాహనంతో ఢీకొట్టి హత్యకు ప్రయత్నించిన సత్యవేడు మండలం కన్నవరానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ భాస్కర్‌ను పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. సీఐ మురళి తెలిపిన ప్రకారం.. సత్యవేడులోని ఉలవచేనుకు చెందిన పవన్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇటీవల పరీక్షలు రాశాడు. ఇతడు కన్నవరం హరిజనవాడకు చెందిన యువతి మూడేళ్లుగా ప్రేమించుకుంటున్నారు. ఆమెను కలిసేందుకు పవన్ తరచూ కన్నవరం వచ్చేవాడు. ఆ యువతి తల్లితో సన్నిహితంగా ఉండే ఫీల్డ్ అసిస్టెంట్ భాస్కర్ వీరి ప్రేమ వ్యవహారంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ పవన్‌ను పలుమార్లు హెచ్చరించాడు. ఈ క్రమంలో భాస్కర్‌కు బుద్ధి చెప్పాలంటూ ఆ యువతి పవన్‌ను కోరింది. దీంతో ఈనెల 24వ తేది మధ్యాహ్నం పవన్ తన స్నేహితులైన సత్యవేడుకు చెందిన భరత్, నాగలాపురం మండలం బీరకుప్పానికి చెందిన సారథి, ఉదయ్‌ను వెంటబెట్టుకుని కన్నవరానికి చేరుకుని భాస్కర్‌తో గొడవపడ్డాడు. స్థానికులు సర్ది చెప్పి పంపేశారు. దీన్ని అవమానంగా భావించిన భాస్కర్.. పవన్‌ను మట్టుబెట్టాలని నిర్ణయించుకున్నాడు. అదే రోజు సాయంత్రం తన లగేజీ వాహనంలో సత్యవేడు నుంచి కన్నవరానికి వస్తుండగా.. మార్గమధ్యంలో ఏఎంపురం వద్ద పవన్ తన స్నేహితులతో కలిసి ద్విచక్ర వాహనంపై ఎదురుగా వస్తుండడం గమనించి వేగంగా ఢీకొన్నాడు. ఈ ఘటనలో సారథి, ఉదయ్, పవన్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో సారథి పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతిలో చికిత్స పొందుతున్నాడు. పవన్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ మల్లికార్జున కేసు నమోదు చేసి భాస్కర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అంతకుముందు పోలీస్‌స్టేషన్ వద్ద భాస్కర్‌ను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని బాధితుల కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున చేరుకున్నారు. చట్టప్రకారం న్యాయం చేస్తామని సీఐ మురళి హామీ ఇవ్వడంతో వారు వెనుదిరిగారు.

'ఎర్ర'స్మగ్లర్ శివమణిపై పీడీ యాక్టు

తిరుపతి(నేరవిభాగం), మార్చి 28(ఆంధ్రజ్యోతి): తమిళనాడుకు చెందిన ఎర్రచందనం స్మగ్లర్ శివమణిపై పీడీ యాక్టు నమోదు చేయాలని ప్రభుత్వం శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. తమిళనాడు తిరువణ్ణామలై జిల్లా నల్లపట్టు గ్రామానికి చెందిన శివమణి అలియాస్ శివమణి గోవిందన్ శేషాచలం అడవుల నుంచి ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తున్నాడు. ఇతనిపై చాలా కేసులు ఉండడంతో పీడీ యాక్టు నమోదుకు టాస్క్‌ఫోర్సు అధికారులు కలెక్టర్‌కు లేఖ రాశారు. పరిశీలించిన కలెక్టర్ వెంకటేశ్వర్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.



పోలేరమ్మ వెల్లనంపు గ్రామోత్సవం



ఊరేగింపులో గణాచారి, ఈవో నవీన్‌కుమార్ తదితరులు

- ఘనంగా పోలేరమ్మ వెల్లనంపు గ్రామోత్సవం
- ముగిసిన ముత్యాలమ్మ జాతర

అక్కా.. పోయి వస్తానే..!

చిల్లకూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): 'అక్కా.. పోయి వస్తానే. మళ్లీ వచ్చే ఏడాది వస్తానే..' అంటూ పోలేరమ్మ తన సోదరి ముత్యాలమ్మకు చెప్పి నిమజ్జనానికి బయలుదేరగా, భక్తులు చీరలు పరిచి సాగిలిపడి సాగనంపారు. ముత్యాలమ్మ జాతరలో ఆఖరి ఘట్టమైన 'పోలేరమ్మ వెల్లనంపు' కార్యక్రమం శుక్రవారం వైభవంగా జరిగింది. చిల్లకూరు మండలం తూర్పుకనుపూరులో నాలుగురోజులు పాటు వైభవంగా జరిగిన జాతర శుక్రవారంతో ముగిసింది. గంగమిట్ట మీద కొలువుతీరిన పోలేరమ్మకు వేకువజామున కుంభం పోసి, నైవేద్యం సమర్పించారు. అనంతరం పోలేరమ్మ జాతర ముగుస్తున్నట్లు గణాచారి ప్రకటించారు. ఆ తర్వాత పోలేరమ్మ విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించారు. కార్యక్రమం ప్రారంభంకాగానే బాణసంచా పేల్చగా అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. వీధులలో మహిళలు చీరలు పరిచి అమ్మవారిని చీరలపై సాగనంపారు. కోరుకున్న కోర్కెలు తీర్చాలంటూ మహిళలు పూజలు చేశారు. పురవీధులలో గ్రామోత్సవం నిర్వహించాక పోలేరమ్మ తన సోదరి ముత్యాలమ్మను అక్కా వెళ్లివస్తానంటూ పలకరించే సన్నివేశం భక్తులను ఆకట్టుకుంది. ముత్యాలమ్మ ఆలయంలో పోలేరమ్మ విగ్రహాన్ని ఉంచి గణాచారి ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఊరి చివర మైదానంలోకి పోలేరమ్మ విగ్రహాన్ని తీసుకెళ్లి అక్కడ పంబలోళ్ల డప్పు వాయిస్తుండగా.. ఆసాదులు పోలేరమ్మ కథను భక్తులకు వినిపించారు. ఆమెకు ఇష్టమైన బూతు పురాణాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా మహిళలకు అమ్మవారి పూనకం వచ్చి, చిందులు వేస్తూ వచ్చే ఏడాది వస్తానంటూ చెబుతారు. ఆ మహిళలపై గణాచారి వసుపునీళ్లు చల్లి దీవెనలు అందించడంతో జాతర ముగిసింది. ఆలయ ఈవో నవీన్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించగా, డీఎస్పీ గీతాకుమారి బందోబస్తు నిర్వహించారు. ఇక, జాతర ముగియడంతో భక్తులు ఒక్కసారిగా వెనుదిరగడంతో రద్దీ నెలకొంది. తూర్పుకనుపూరులో తిరుగు ప్రయాణమయ్యే జనంతో పోటెత్తిపోయింది. వాహనాలు వరుసక్రమంలో బారులు తీరడంతో పలు చోట్ల రాకపోకలు ఆగాయి. కాగా, ముత్యాలమ్మ జాతర సందర్భంగా హుండీ శుక్రవారం హుండీ లెక్కించగా మొత్తం రూ.64,46,838 ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు. అదే గతేడాది రూ.53,60,973 వచ్చిందన్నారు. గతేడాది కంటే రూ.11,14,135 పెరిగింది.



జాతర నుంచి తిరిగి గ్రామాలకు వెళ్లేందుకు బస్సుల కోసం వేచివున్న భక్తులు

మాటిస్తే నెరవేర్చే వరకు మరువను

- ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి):ఎవరికైనా సరే మాటిస్తే నెరవేర్చే వరకు మరిచేదిలేదని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు.మరమగ్గ, చేనేత కార్మికుల చిరకాల వాంఛ అయిన ఉచితవిద్యుత్ జీవో విడుదల చేసిన సందర్భంగా నగరి పట్టణ పరిధిలోని ఏకాంబరకుప్పం రైల్వేగేట్ సమీపంలో శుక్రవారం రాత్రి కృతజ్ఞతా సభ ఏర్పాటు చేశారు.వేలాదిమంది చేనేత, మరమగ్గ కార్మికులు హాజరైన ఈ సభకు ఎమ్మెల్యే భానుప్రకాష్ రాగానే గజమాలలతో ఘనంగా స్వాగతం పలికారు.అనంతరం ఆయన సభలో మాట్లాడుతూ నగరి నియోజకవర్గంలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 6 నెలల్లో 60 కోట్ల రూపాయలతో సిమెంటురోడ్లు వేయడం జరిగిందన్నారు.ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు నేతన్నలకు,మరమగ్గ కార్మికులకు నెలకు 500 యూనిట్లు, చేనేత కుటుంబాల వారికి 200 యూనిట్లు ఉచిత విద్యుత్ అమలుకు జీవోను సైతం విడుదల చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు ,మంత్రి లోకేశ్‌కే దక్కుతుందన్నారు.గతంలో ఏ ప్రభుత్వం కూడా తీసుకోని ఈ మంచి నిర్ణయాన్ని తీసుకుని నేతన్నలకు పూర్వ వైభవం వచ్చేలా చంద్రబాబు కృసి చేశారన్నారు.2012లో తన తండ్రి ముద్దుకృష్ణమ నాయుడు 50శాతం విద్యుత్ సబ్సిడీని నేతన్నలకు ఇప్పించడం జరిగిందని గుర్తు చేశారు.అలాగే నగరి మున్సిపాలిటీ అయ్యాక ఇంటి పన్ను ఎక్కువైందంటే ఆయనే తగ్గించేందుకు కృషి చేశారన్నారు.వైసీపీ అధికారంలో వున్నపుడు పెంచిన కరెంటు చార్జీలను భరించలేక మరమగ్గ కార్మికులు తమ వృత్తిని వదిలి పక్క రాష్ట్రాలకు వలస వెళ్లారన్నారు.ఏకాంబరకుప్పం రైల్వేగేట్ అండర్‌బ్రిడ్జి ఏర్పాటుకు సైతం నిధులు మంజూరు చేయించడం జరుగుతుందన్నారు.స్థానిక టీడీపీ నాయకులతో పాటు టీడీపీ చిత్తూరు పార్లమెంటరీ అధికార ప్రతినిధి చినబాబు తదితరులు పాల్గొన్నారు.



మరమగ్గ కార్మికుల కృతజ్ఞతా సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్



హత్యాయత్నం కేసులో ఆడిటింగ్ అధికారి అరెస్టు

శ్రీకాళహస్తి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): భార్యపై హత్యాయత్నానికి పాల్పడ్డాడన్న కేసులో ప్రభుత్వ ఆడిట్ ఆఫీసర్ మధుకిరణ్‌రెడ్డిని పోలీసులు శుక్రవారం శ్రీకాళహస్తీశ్వరాలయం పరిపాలన భవనం వద్ద అరెస్టు చేశారు. వివరాలిలా ఉన్నాయి. చిత్తూరులో అసిస్టెంట్ ఆడిటింగ్ ఆఫీసర్‌గా పని చేస్తున్న మధుకిరణ్‌రెడ్డి రెండు రోజుల క్రితం డిప్యూటేషన్‌పై శ్రీకాళహస్తీశ్వరాలయంలోని ఆడిటింగ్ విభాగానికి బదిలీ అయ్యారు. ఈనెల 17న కడప మహిళా పోలీస్‌స్టేషన్‌లో మధుకిరణ్‌రెడ్డిపై ఆయన భార్య ఫిర్యాదు మేరకు హత్యాయత్నం కేసు నమోదైంది. కేసు విచారణలో భాగంగా కడప మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ కృష్ణారెడ్డి శుక్రవారం శ్రీకాళహస్తీశ్వరాలయం పరిపాలన భవనం వద్దకు చేరుకున్నారు. విధుల్లో ఉన్న అసిస్టెంట్ ఆడిటింగ్ అధికారి మధుకిరణ్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని 1టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అక్కడి నుంచి కడప మహిళా పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

ముత్యాలమ్మకు పట్టు వస్త్రాల సమర్పణ


పట్టు వస్త్రాలు తీసుకువస్తున్న ఎమ్మెల్యేలు సునీల్‌కుమార్, రామకృష్ణ, టీడీపీ సీనియర్ నేతలు కొండేపాటి గంగాప్రసాద్, తానంకి నానాజీ

చిల్లకూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కనుపూరులో ముత్యాలమ్మకు ఎమ్మెల్యేలు పాశిం సునీల్ కుమార్, కురుగొండ్ల రామకృష్ణ, ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్, టీడీపీ సీనియర్ నాయకుడు తానంకి నానాజీ పట్టు వస్త్రాలు సమర్పించారు. నాలుగు రోజుల పాటు జరిగిన జాతర శుక్రవారం ముగిసింది. ఎమ్మెల్యేలతో పాటు టీడీపీ నాయకులు అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకురావడంతో వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ పూర్ణకుంభంతో ఆలయ ఈవో నవీన్‌కుమార్ స్వాగతం పలికారు. జాతరకు పెద్దసంఖ్యలో భక్తులు హాజరవడంతో తూర్పుకనుపూరులో రద్దీ నెలకొంది. వాహనాలు బారులు తీరడంతో పలు చోట్ల ట్రాఫిక్ సమసమ్య ఉత్పన్నమైంది.

పెరిగిన అమ్మవారి హుండీ ఆదాయం


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తునన భక్తులు, సిబ్బంది

చిల్లకూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ముత్యాలమ్మ హుండీ ఆదాయం గతేడాది కంటే ఈసారి రూ.11,14,135 పెరిగినట్లు ఆలయ ఈవో నవీన్ కుమార్ తెలిపారు. శుక్రవారం అమ్మవారి ఆలయంలో హుండీ లెక్కింపు నిర్వహించారు. అమ్మవారికి సమర్పించిన దున్నపోతుల వేలం పాటల ద్వారా గతేడాది రూ.19,35,000 రాగా, ఈ ఏడాది రూ.16,80,000 వచ్చింది. ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా గతేడాది రూ.11,05,110 రాగా ఈసారి రూ.16,85,300 వచ్చింది. హుండీ ద్వారా గతేడాది రూ.23,20,863 ఆదాయం రాగా, ఈ ఏడాది రూ.30,81,53 వచ్చింది. మొత్తం మీద గతేడాది రూ.53,60,973 ఆదాయం రాగా, ఈ ఏడాది రూ.64,46,838 వచ్చిందని ఈవో పేర్కొన్నారు.

నెలబల్లిలో ప్రభుత్వ భూముల పరిశీలన


నెలబల్లిలో భూములను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, తహసీల్దారు శైలాకుమారి

దొరవారిసత్రం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం మండలం నెలబల్లిలో జాతీయ రహదారి పక్కన గల ప్రభుత్వ భూములను జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ శుక్రవారం పరిశీలించారు. జాతీయ రహదారి పక్కన సర్వే నెంబరు 7లోని 5 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎన్నో ఏళ్ల నుంచి సాగు చేసుకొంటున్నామని, తమకు డీ పట్టాలు మంజూరు చేయాలని ఆ గ్రామానికి చెందిన పునబాక రమణయ్య, ఆయన సోదరులు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. దీంతో జేసీ ఆ పరిశీలించారు. జాతీయ రహదారి పక్కన ఉన్న భూములు ప్రభుత్వ అవసరాలకు ఉపయోగపడే అవకాశం ఉన్నందున పట్టాలు ఇవ్వలేమని జేసీ స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు శైలాకుమారి, ఆర్ఐ ప్రవీణ్‌రాయల్, వీఆర్వో రమేష్ పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 26 మంది ఎంపిక



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శివప్రసాద్

గూడూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం శ్రీసిటీకి చెందిన వివిధ కంపెనీల ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. 50 మంది అభ్యర్థులు హాజరు కాగా, వివిధ కంపెనీలు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 26మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శివప్రసాద్, కోటేశ్వరరావు, లక్ష్మి పాల్గొన్నారు.

వార్షిక రుణ ప్రణాళికపై సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం హేమామాలిని

పెళ్లకూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): పొదుపు సంఘాలకు రుణాలు, జీవనోపాధుల కార్యాచరణ ప్రణాళికపై పెళ్లకూరు వెలుగు కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. వెలుగు ఏపీఎం హేమామాలిని మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో మహిళా ఎన్యూమరేటర్లు ఏప్రిల్ 1 నుంచి పొదుపు మహిళల ఇంటి వద్దకే వెళ్లి ఎంత రుణం ఏ నెలలో కావాలి, ఎప్పుడు కావాలి, రుణం పొందేందుకు గల అవసరాన్ని తెలుసుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎల్‌సీసీ శీనయ్య, వెలుగు సీసీలు రమణమ్మ, చంద్రసేన తదితరులు పాల్గొన్నారు.

11న ఢిల్లీలో లాంగ్‌మార్చ్

నాయుడుపేట టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో ఏప్రిల్ 11వ తేదీ నిర్వహించనున్న లాంగ్‌మార్చ్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నాయుడుపేటకు చెందిన ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి రామచంద్ర పిలుపునిచ్చారు. శుక్రవారం లాంగ్‌మార్చ్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యవసర సరుకుల ధరల నియంత్రణ, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనతో పాటు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అలాగే మతతత్వ రాజకీయాలు మానుకోవడంతో పాటు నేతాజీకి సంబంధించిన డీఎన్‌ఏ పత్రాలను బహిర్గత పరచాలని కోరారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోకి అనుమతి లేకుండా ప్రవేశంపై కేసు

నాయుడుపేట టౌన్, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోకి అక్రమంగా ప్రవేశించినందుకు మండలంలోని కూచువాడకు చెందిన ఆశీష్, కార్తీక్, మరి కొంతమందిపై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. శుక్రవారం ఆశీష్, కార్తీక్‌తో పాటు మరి కొంతమంది అనుమతి లేకుండా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోకి ప్రవేశించి ఫొటోలు, వీడియోలు తీశారు. ప్రశ్నించిన ఇన్‌చార్జి సబ్‌రిజిస్ట్రార్ పెంచలయ్యను బెదించారు. అనంతరం కార్యాలయం ఎదుట నినాదాలు చేశారు. ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అండగుండాల రోడ్డుకు మోక్షం ఎప్పుడో..?

తడ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): అన్ని దహదారులు బాగుపడుతున్నా... అండగుండాల రోడ్డుకు మాత్రం మోక్షం కలగడం లేదు. అధికారులకు, నాయకులకు విన్నవించుకుంటున్నా పట్టించుకునే వారే లేరు. మండల పరిధిలోని అండగుండాల గ్రామానికి వెళ్లాలంటే.. అక్కంపేట జాతీయ రహదారి నుంచి సుమారు 2 కిలోమీటర్ల మేర ప్రయాణించాలి. వరదయపాలెం మండలంలోని కారిపాకం గ్రామానికి వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ రోడ్డుకు గ్రహణం పట్టింది. అప్పటి ప్రభుత్వం కనీసం మరమ్మతులు చేయకపోవడంతో దారుణంగా దెబ్బతింది. గుంతలమయమైన ప్రయాణం నరకప్రాయంగా మారింది. కూటమి ప్రభుత్వం వచ్చాక పల్లె పండుగ పేరుతో అన్ని గ్రామాల్లోని రోడ్లకు నిధులు కేటాయించి బాగు చేస్తున్నారు. అయితే అండగుండాల రోడ్డును మాత్రం ఎవరూ పట్టించుకోవడంలేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపి రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


కంకర తేలి అధ్వానంగా ఉన్న అండగుండాల రోడ్డు

కురుగొండలో రూ.1.25 కోట్ల ఉపాధి పనులు


గ్రామసభలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు అంకయ్య

ఓజిలి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కురుగొండలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.1.25 కోట్ల ఉపాధి పనులు జరిగాయని డీఆర్పీ ప్రసన్నకుమార్‌రెడ్డి వెల్లడించారు. శుక్రవారం కురుగొండలో గ్రామస్థాయి ఆడిట్ జరిగింది. ఈసందర్భంగా డీఆర్పీ మాట్లాడుతూ ప్రధానంగా గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో 13 పనులు, కేటిల్ పాండ్స్ కోసం 26 పనులతో పాటు డ్రైనేజీ, సిమెంటు రోడ్ల పనులు చేపట్టడం జరిగిందన్నారు. గ్రామ పరిధిలో ఇంకా రూ.లక్ష మేర చేపట్టాల్సిన పనులు ఉన్నాయని, వాటిని చేయించాలని క్షేత్ర సహాయకుడికి నిర్దేశించామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు, విశ్రాంత డీపీఎంవో డాక్టర్ దారా అంకయ్య, టీఏ మహేష్, కార్యదర్శి కావ్య, ఈసీ సుబ్రహ్మణ్యం, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి జీఎస్టీ కీలకం

కేంద్ర వార్షిక బడ్జెట్, పన్నులు, ఆడిటింగ్‌పై శ్రీసిటీలో అవగాహన సదస్సు

శ్రీసిటీ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): భారతదేశ ఆర్థిక వ్యవస్థను ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలబెట్టేందుకు జీఎస్టీ కీలకంగా మారుతుందని గుంటూరు ఆడిట్ కమిషనరేట్, ఐఆర్ఎస్ కమిషనర్ పి.ఆనంద్ కుమార్ తెలిపారు. శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి ఆధ్వర్యంలో శ్రీసిటీలో శుక్రవారం కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు చెందిన కేంద్ర పరోక్ష పన్నులు, సుంకాల మండలి (సీబీఐసీ), భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ), శ్రీసిటీ సంయుక్త ఆధ్వర్యంలో కేంద్ర వార్షిక బడ్జెట్, పన్నుల ఆడిటింగ్‌పై అవగాహన సదస్సు జరిగింది. సదస్సులో పరిశ్రమలకు తాజా పన్నుల విధానం, అనుగుణ్యత మార్గదర్శకాలు, కేంద్ర బడ్జెట్ ప్రభావం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆనంద్‌కుమార్ ప్రభుత్వం జీఎస్టీని సులభతరం చేయడానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. 'ఒక దేశం ఒక పన్ను' విధానం వల్ల పన్ను చెల్లింపు దారుల సంఖ్య 70 లక్షల నుంచి 140 లక్షల వరకు పెరిగిందన్నారు. మధ్యస్థ పన్నురేటు 14.5 శాతం నుంచి 11.5 శాతానికి తగ్గిందని దీని ఫలితంగా ఆర్థిక వృద్ధి వేగంగా పెరుగుతూ, వికసిత్ భారత్ 2047 లక్ష్యాన్ని సాధించడానికి ప్రాముఖ్యం సంతరించుకుంటోందని తెలిపారు. పన్ను చెల్లింపు ప్రక్రియను మరింత సులభతరం చేయడంతో పాటు పన్ను చెల్లింపుదారుల సంఖ్యను పెంచేందుకు తమ విభాగం


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఆనంద్‌కుమార్

ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. రాయలసీమ జోన్ జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ మాలతి మాట్లాడుతూ.. ప్రస్తుత బడ్జెట్‌లో వివిధ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, అంతర్గత జలమార్గాలు, సాగర్‌మాలా, ప్రధాన్‌మంత్రి గతిశక్తి, ఆత్మనిర్భర్ భారత్ అభియాన్, పరిశోధన - అభివృద్ధి, స్టార్టప్‌లు, వ్యవసాయం, ఇతర రంగాలకు కేటాయించిన నిధుల వివరాలను వివరించారు. కార్యక్రమంలో శ్రీసిటీలోని వివిధ పరిశ్రమల ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

31లోగా ఈకేవైసీ చేయించుకోండి

కోట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): రేషన్‌కార్డు దారులు ఈ నెల 31వ తేదీ లోగా ఈకేవైసీ చేసుకోవాలని తహసీల్దారు జయజయరావు తెలిపారు. రేషన్ డీలర్లు ఈ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా గ్రామ, వార్డు, సచివాలయాల యాప్, రేషన్‌షాపులోని ఈ పోస్ ద్వారా ఈకేవైసీ చేసుకునే సౌకర్యం కల్పించామన్నారు. 5 సంవత్సరాలలోపు పిల్లల మినహా మిగిలిన లబ్ధిదారులు అందరూ ఈకేవైసీ చేసుకోవాలని తహసీల్దారు సూచించారు.

రెండు ఆలయాల్లో చోరీ


ముళ్లచెట్లలో పడి ఉన్న హుండీని బయటకుతీస్తున్న స్థానికులు

తడ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కారిజాత గ్రామంలో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయం, దళితవాడలోని సీతారాముల ఆలయంలో హుండీలు చోరీకి గురయ్యాయి. గురువారం అర్ధరాత్రి సమయంలో దొంగలు ఆలయంలోకి చొరబడి హుండీలను ఎత్తుకెళ్లారు. ఈ రెండు హుండీలను గ్రామ శివార్లలోని చెట్లలో పడేసి, వాటిల్లో నగదు ఎత్తుకెళ్లారు. దళితవాడలో ఉన్న సీతారాముల ఆలయంలోని హుండీలో సుమారు రూ.30వేలవరకు భక్తులు సమర్పించిన కానుకలు ఉండవచ్చని గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

త్రైత సిద్ధాంత క్యాలెండర్ ఆవిష్కరణ

పెళ్లకూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక చింతన పెంపొందించేలా తెలుగు భాషలో త్రైత సిద్ధాంత క్యాలెండర్‌ను రూపొందించటం అభినందయమని తహసీల్దార్ ద్వారకనాథరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంతో పాటు పీహెచ్‌సీ, పోలీస్‌స్టేషన్, చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు ఛారిటబుల్ ట్రస్ట్ కార్యాలయాల్లో క్యాలెండర్లు ఆవిష్కరించి పంపిణీ చేశారు. కార్యక్రమంలో చింత సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, చామంతి, సుమలత తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ కిట్ల పంపిణీ


రంజాన్ కిట్లు అందజేస్తున్న ఈద్గా యూత్ సభ్యులు

గూడూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక దర్గా వద్ద శుక్రవారం ఈద్గా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పేద ముస్లింలకు రంజాన్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో షబ్బీర్, మగ్దూం, మౌలానా, మున్నా, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక మసీదులో నూర్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో ముస్లింలకు రంజాన్ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో హక్, మగ్దూం, హజరత్, సలీం, ఆసీఫ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద వృద్ధ దంపతులకు చేయూత

నాయుడుపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట రజక కాలనీలోని బాలాజీ, రాజమ్మ దంపతులకు ఉయ్ ఆర్ టుగేదర్ సంస్థ వ్యవస్థాపకులు సుబ్బు అయ్యప్ప, ప్రసాద్, పవన్ బియ్యం, నిత్యవసర సరుకులు, కూరగాయలు అందజేశారు.

బీసీ కులగణన చేపట్టాలి

గూడూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): దేశంలో బీసీ కులగణన త్వరితగతిన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజగౌడ్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్‌అండ్‌బీ కార్యాలయ సమీపంలోని జ్యోతిరావ్‌పూలే దంపతుల విగ్రహాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ కులగణన చేపట్టి జనాభా ప్రకారం విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు పెంచాలన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఇదే డిమాండ్లతో ఏప్రిల్ 25న తిరుపతిలో నిర్వహించనున్న బహిరంగసభను విజయవంతం చేయాని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రసాద్, జగదీష్, మధు, రమణయ్య, నాశిన భాస్కర్ గౌడ్, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగివుండాలి


సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాది అరవ పార్వతయ్య

గూడూరు, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగివుండాలని న్యాయవాది అరవ పార్వతయ్య అన్నారు. శుక్రవారం స్థానిక డీఆర్‌డబ్ల్యు కళాశాలలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలపై జరుగుతున్న దాడులను నివారించేందుకు ప్రభుత్వం పోక్సో చట్టాన్ని అమలు చేస్తోందన్నారు. చట్టాలపై విద్యార్థినులు అవగాహన పెంచుకుని రక్షణ పొందాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హనుమంత రావు, కోటేశ్వరరావు, మెహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయాలకు ప్రతీకగా ఉగాది


బ్రాహ్మణ దంపతులను సన్మానిస్తున్న ప్రగతిసేవాసంస్థ సభ్యులు

గూడూరు అర్బన్ మార్చి 28 (ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజల సంప్రదాయాలకు ప్రతీకగా ఉగాది పండుగ నిలుస్తుందని డాక్టర్లు జనార్దనరెడ్డి, రోహిణి అన్నారు. శుక్రవారం స్థానిక వీరభద్రస్వామి ఆలయంలో ప్రగతిసేవాసంస్థ ఆధ్వర్యంలో విశ్వవసు నామ సంవత్సరం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని బ్రాహ్మణ పూజారుల దంపతులను సన్మానించారు. కడివేటి చంద్రశేఖర్, శ్రీనివాసులు, ప్రభాకర్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ యంత్రంలో పడి మహిళా కూలీ మృతి

గుట్టు చప్పుడు కాకుండా అంత్యక్రియలు

కేవీబీపురం, మార్చి 28(శ్రీకాళహిస్తి): వ్యవసాయంలో నిమగ్నమైన ఓ గిరిజన మహిళ ప్రమాదవశాత్తు వేరుశనగ యంత్రంలో చిక్కుకుని మృతి చెందింది. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని గుండిపేడు పంచాయతీ అంగేరి చెరువు ఎస్టీకాలనీకి చెందిన గిరిజన దంపతులు గుంటిపేడు గ్రామానికి చెందిన ఓ రైతు వద్ద రెండేళ్లుగా కూలీలుగా పని చేస్తున్నారు. ఇందులో భాగంగా ఈనెల 25న సాయంత్రం రైతుకు చెందిన పొలంలో వేరుశనగ నూర్పిడి పనులకు వెళ్లారు. నూర్పిడి యంత్రంలో ప్రమాదవశాత్తు చీర కొంగు చిక్కుకోవడంతో మహిళ తీవ్రంగా గాయపడింది. అక్కడ ఉన్న కూలీలు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించింది. అయితే ఈ ఘటన బయటకు పొక్కకుండా గుట్టుచప్పుడు కాకుండా మహిళకు దహన సంస్కారాలు చేసి బాధిత కుటుంబానికి అన్యాయం చేశారని సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరుగుతోంది. అయితే ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని కేవీబీపురం పోలీసులు తెలిపారు.

కార్యాలయాల చుట్టూ ప్రజలను తిప్పుకోవద్దు



సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా

బాలాయపల్లి, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా సమస్యలను పరిష్కరించాలని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా అన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయం సమావేశ భవనంలో వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలంగా నెలకొన్న సమస్యలపై ప్రజలు ఎక్కువగా తిరుగుతున్నారని, వాటి పరిష్కారానికి రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పరిష్కరించలేని సమస్యలకు కారణాలు తెలుపుతూ రికార్డు తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు శ్రీనివాసులు, రాంబాబు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో తాగునీటి సమస్య పరిష్కరించండి

వెంకటగిరి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పట్టణంలోని వార్డుల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కౌన్సిలర్లు కోరారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం బడ్జెట్ సమావేశం జరిగింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.102 కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టగా కౌన్సిలర్లు ఆమోదిం చారు. మున్సిపాలిటీలో ఆదాయ వనరులు ఉన్నా.. వాటిని సద్వినియోగం చేసుకోవడంలో అధికారులు విఫలం అవుతున్నారని పలువురు కౌన్సిలర్లు విమర్శించారు. ఏఏ అంశాలపై ఆదాయం వస్తుందో సూచించడంతో పాటు పన్నుల వసూళ్లల్లో చొరవ చూపాలంటూ మున్సిపల్ సిబ్బందికి కమిషనర్ సూచించారు. సమావేశంలో కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడితో కోలా భేటీ

శ్రీకాళహస్తి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్‌ను శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఢిల్లీలోని ఆయన నివాసంలో ఎమ్మెల్సీ సోము వీర్రాజుతో కలిసి ఆయన్ను సన్మానించారు. ముక్కంటి దుశ్శాలువా, తీర్థప్రసాదాలు అందజేశారు.



వైసీపీ నాయకుడికి ఘన సన్మానం

శ్రీకాళహస్తి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవనాయుడిని శుక్రవారం శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు తన స్వగృహంతో సత్కరించారు. ఈ సందర్భంగా అంజూరు మాట్లాడుతూ... ఉమ్మడి జిల్లాలో పార్టీ అభివృద్ధికి మరింతగా కృషి చేయాలని వాసుదేవనాయుడిని కోరారు. ఈ కార్యక్రమంలో కోవి చంద్రయ్యనాయుడు, స్వర్ణమూర్తి, భాస్కర్ ముదిరాజ్, చంద్రరాజు, జయశ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోడౌన్ త్రైమాసిక తనిఖీ

రేణిగుంట, మార్చ్ 28 (ఆంధ్రజ్యోతి): పాత విమానాశ్రయం రోడ్డు లోని గోదాములో భద్ర పరిచిన ఈవీఎంలను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వెంకటేశ్వర్ శుక్రవారం త్రైమాసిక తనిఖీలు నిర్వహించారు. గోదాము వద్ద నిరంతరం పటిష్ఠ నిఘా ఉండాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు సెంట్రల్ వేర్ హౌసింగ్ గోడౌన్‌లో భద్రపరిచిన ఈవీఎంలను వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఈవీఎం గోడౌన్ రిజిస్టర్ నందు సంతకం చేశారు.



విద్యా సామగ్రి పంపిణీ



రేణిగుంట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీవగ్రాంలో ఉన్న పీఎం హైస్కూల్ విద్యార్థులకు చేయూత సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు జూలియన్ రాజు, శ్రీనివాసులు, పాఠశాల హెచ్‌ఎం మేరీ జోన్స్, ఉపాధ్యాయులు ప్రభాకర్, హైమావతి, ఆనంద్, ప్రసన్న పాల్గొన్నారు.

విద్యుత్తు చార్జీలు తగ్గించాలి: సీపీఐ



రేణిగుంట, మార్చి 28, (ఆంధ్రజ్యోతి): ఇటీవల పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలంటూ పట్టణంలోని మంచినీళ్ల గుంట సమీపంలో ఉన్న విద్యుత్ కార్యాలయం ముందు వామపక్ష నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు తులసి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో బాదుడే బాదుడు అంటూ ప్రచారం చేసిన కూటమి పార్టీలు నేడు అధికారంలోకి వచ్చి ప్రజలు నడ్డి విరిచే విధంగా విద్యుత్తు చార్జీల పెంచారని మండిపడ్డారు. వెంటనే పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణ, మురళి, దిలీప్, భాషా, ఈశ్వరమ్మ, మునిస్వామి, భారతి, సులోచన, మహాలక్ష్మి పాల్గొన్నారు.

తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం సినీహీరో నితిన్‌తో కలిసి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్ దర్శించుకున్నారు. బ్రేక్ సమయంలో స్వామివారి సేవలో పాల్గొన్నారు. అనంతరం ఆలయ అధికారులు వారికి తీర్థప్రసాదాలు అందజేశారు.



పోలీసుల పల్లె నిద్ర

శ్రీకాళహస్తి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి 1టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి గోపాలకృష్ణారెడ్డి కాలనీలో పోలీసులు పల్లె నిద్ర చేశారు. ఇందులోభాగంగా ఆ ప్రాంత ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. చట్టాలపై అవగాహన కల్పించారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ గోపి తదితరులు పాల్గొన్నారు.

వీడిన యువతి అదృశ్యం కేసు

వరదయ్యపాళెం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు చొరవతో యువతి అదృశ్యం కేసు మిస్టరీ వీడింది. మండలంలోని పాండూరు పంచాయతీకి చెందిన నాగరాజు కుమార్తె స్నేహ రెండు రోజుల కింద సూళ్ళూరుపేట ఆస్పత్రికి వెళ్లి అదృశ్యమైంది. దీనిపై గురువారం ఎమ్మెల్యే ఆదిమూలం ఎస్పీని కలిసి వివరించారు. ఎస్పీ ఆదేశాలతో పోలీసు బృందం విచారణ చేపట్టి తిరుపతిలోని శ్రీనివాసం భక్తుల విడిది కేంద్రంలో ఉన్నట్లు పోలీసులు గుర్తించి శుక్రవారం ఆ యువతిని తల్లిదండ్రులకు అప్పగించారు.

11న లాంగ్‌మార్చ్

శ్రీకాళహస్తి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): జాతీయ సంపద అయిన ప్రభుత్వాస్తులను ప్రైవేటీకరణను తక్షణమే నిలపాలంటూ ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి రామచంద్ర పిలుపునిచ్చారు. శుక్రవారం విజయవాడలో ఢిల్లీలో ఏప్రిల్ 11న జరిగే లాంగ్‌మార్చ్ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిన ధరలను నియంత్రించాలన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. బీజేపీ మతతత్వ రాజకీయాలను ఆపాలన్నారు. నేతాజీ, ఐఎన్‌ఏకు సంబంధించిన పత్రాలను కేంద్రప్రభుత్వం బహిరంగపరచాలని డిమాండ్ చేశారు. ట్రేడ్ యూనియన్ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు తదితరులుపాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఎస్‌ఐ, కానిస్టేబుళ్లకు గాయాలు

బుచ్చినాయుడుకండ్రిగ, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తహనగర్ జాతర బందోబస్తుకు వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎస్‌ఐ విశ్వనాథనాయుడు, కానిస్టేబుల్ ప్రభాకర్‌కు గాయాలయ్యాయి. మండలంలోని తహనగర్‌లో గురువారం జాతర జరిగింది. జాతరలో బందోబస్తు నిర్వహించి రాత్రి 12 గంటల సమయంలో ఎస్‌ఐ, కానిస్టేబుల్‌తో కలిసి వాహనంలో తిరిగి వస్తుండగా జీఎన్‌కండ్రిగ దగ్గర వ్యాన్‌కు అడ్డంగా పంది రావడంతో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో వాహనంలో ఉన్న ఎస్‌ఐ, కానిస్టేబుల్‌కు గాయాలవడంతో స్థానికులు వారిని శ్రీకాళహస్తిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఎస్‌ఐను మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఎస్‌ఐను ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు, వైసీపీ మండల కన్వీనర్ మణినాయుడు ఆస్పత్రిలో పరామర్శించారు.

ఒలంపియాడ్ పరీక్షల్లో రాయలసీమ విద్యార్థుల ప్రతిభ

శ్రీకాళహస్తి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాయలసీమ జూనియర్ కళాశాల విద్యార్థులు గత సంవత్సరం నవంబరు, డిసెంబరులో ఒలంపియాడ్ పరీక్షలను రాశారు. అందులో గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, ఇంగ్లీష్ రీజనింగ్ పరీక్షల్లో 10 లోపు ర్యాంకులను 22మంది సాధించారు. 20 లోపు ర్యాంకులను 18 మంది సాధించారు. వీరిని శుక్రవారం కళాశాలలో ప్రిన్సిపాల్ జయభారత్‌రెడ్డి అభినందించారు. కరస్పాండెంట్ సుబ్బరామిరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

సచివాలయాల విలీనం

- పుత్తూరు మున్సిపాలిటీలో 13నుంచి ఆరుకు కుదింపు
- ప్రభుత్వానికి నివేదించిన మున్సిపల్ అధికారులు

పుత్తూరు అర్బన్, మార్చి 28(ఆంధ్రజ్యోతి): సచివాలయ విధానాన్ని సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ విధానంలో ప్రతి రెండు సచివాలయాలను క్లస్టర్‌గా ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ మేరకు ప్రభుత్వానికి పుత్తూరు మున్సిపల్ అధికారులు నివేదిక సమర్పించారు. పుత్తూరు పట్టణ పరిధిలో 13 సచివాలయాలున్నాయి. వీటిని ఆరుకు కుదించారు. పల్లూరు, రాచపాళెం సచివాలయాలను ఒకటిగా, సత్యనారాయణ కాలనీ, పిళ్లారిపట్టు ఒకటిగా, దాసరి గుంట వీధి, గోవిందపాలెం సచివాలయంగా, నందిమంగళం, ఎన్జీవో కాలనీ ఒకటిగా ఆర్టీసీ కాలనీ, కల్యాణపురం, ఆరేటమ్మ కాలనీ మూడు సచివాలయాలను ఒకటిగా, అంబేడ్కర్ సర్కిల్, లక్ష్మీనగర్‌ను సచివాలయంగా నివేదికలు రూపొందాయి. ప్రస్తుతం ఒక్కో సచివాలయానికి 10 మంది చొప్పున సిబ్బంది ఉన్నారు. అడ్మిన్ సెక్రటరీతో పాటు అమినిటీస్ , శానిటరీ, ఎడ్యుకేషన్, ప్లానింగ్, వెల్ఫేర్, ఉమెన్ ప్రొటెక్షన్, హెల్త్, ఎనర్జీ, రెవెన్యూ సెక్రటరీలు ఉన్నారు. సచివాలయాల కుదింపుతో రెండు సచివాలయాల్లో అందించే సేవలు ఒక్కరే నిర్వహించాల్సి ఉంటుంది. మిగిలిన ఉద్యోగులను ఇతర విభాగాల్లో సర్దుబాటు చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

సమన్వయంతోనే అభివృద్ధి



వడమాలపేట, మార్చి 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి నాయకులు సమన్వయంతోనే సాధ్యమని ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ చెప్పారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో జడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ రెడ్డి ప్రత్యేక కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రభుత్వం స్థానిక సంస్థలను పోత్సహిస్తోందని చెప్పారు. యేటా విడుదయ్యే ఆర్థిక మండల నిధుల ద్వారా గ్రామాలను అభివృద్ధి చేయాలని చెప్పారు. అర్హులందరూ లబ్ధిపొందేలా నాయకుల కృషి చేయాలని చెప్పారు.

ఘనంగా పులి మస్తాన్ వర్ధంతి

శ్రీకాళహస్తి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద శుక్రవారం దళిత నాయకుడు పులి మస్తాన్ 9వ వర్ధంతిని నిర్వహించారు. ఆయన కుమారుడు పులి శ్రీకాంత్ ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు

నేడు పిచ్చాటూరులో ఎమ్మెల్యే పర్యటన

పిచ్చాటూరు, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండలంలో ఎమ్మెల్యే ఆదిమూలం పర్యటించనున్నట్లు ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు ముడియూరుకి చేరుకుని టీడీపీ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొంటారు. 10.30 గంటలకు పిచ్చాటూరు బైపాస్ చెక్‌పోస్టు వద్ద సిమెంటు రోడ్డు, పౌర సరఫరాల గోదామును ప్రారంభిస్తారు. అలాగే గోవర్ధనగిరిలో సిమెంటు రోడ్డు ప్రారంభిస్తారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



రైతులకు వ్యవసాయ పనిముట్లు అందిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నాగలాపురం, మార్చి 28, (ఆంధ్రజ్యోతి): రసాయన రహిత ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపాలని ఎమ్మెల్యే ఆదిమూలం పిలుపునిచ్చారు. శుక్రవారం నాగలాపురం ఎంపీడీవో కార్యాలయంలో వ్యవసాయ సహా అనుబంధ శాఖల అధికారులు సమావేశమై ఖరీఫ్‌లో పండించే పంటలపై ప్రణాళికలు రూపొందించడం, ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై చర్చించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఆదిమూలం మాట్లాడుతూ... ప్రకృతి వ్యవసాయం వల్ల భూమికి, రైతులకు, వినియోగదారుడికి మేలు జరుగుతుందన్నారు. అలాగే నాణ్యమైన, ఆరోగ్య వంతమైన పంటలు పొందవచ్చని, సాగు ఖర్చు కూడా తగ్గుతుందని ఆయన తెలిపారు. అనంతరం రైతులకు వ్యవసాయ పనిముట్లను పంపిణీ చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస యాదవ్, నాయకులు పార్తిబన్, సెల్వకుమార్, మురళి, రాజవేలు, రుద్రయ్య, మనోజ్‌కుమార్, రాజారాం, చాన్‌బాషా, మయున, ఏవో సుబ్బారాయులు తదితరులు పాల్గొన్నారు.

సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో హ్యాక్ ఫెస్ట్



బహుమతులు ప్రదానం చేస్తున్న అశోకరాజు

నారాయణవనం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో 24 గంటల్లో కంప్యూటర్ సాఫ్ట్‌వేర్‌లో తలెత్తిన సమస్యను ఎలా పరిష్కరించాలి అనే కార్యక్రమాన్ని హ్యాక్‌ఫెస్ట్ 2కె25 పేరుతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుమారు 420 మంది విద్యార్థులు హాజరయ్యారు. గురువారం మధ్యాహ్నం మొదలై శుక్రవారం మధ్యాహ్నానికి ముగిసింది. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగ అధిపతులు సమస్యలను ఇవ్వగా విద్యార్థులు వాటిని 24 గంటల్లో పరిష్కరించారు. ఈ కార్యక్రమానికి జడ్జిలుగా బెంగళూరుకు చెందిన ఆర్టిఫిషియల్ అండ్ డే లా, ఫకీరప్ప అండ్ కుమార్, తిరుపతికి చెందిన టేక్ ఆఫ్ సంస్థ తదతరులు వ్యవహరించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ అశోకరాజు విచ్చేసి మాట్లాడుతూ... భవిష్యత్తులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రధాన పాత్ర పోషించనుందన్నారు. ఇక సమస్యలను సత్వరం పరిష్కరించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందించారు. కళాశాల ప్రిన్సిపాళ్లు చంద్రశేఖర్ రెడ్డి, జనార్ధన రాజు, వైస్ ప్రిన్సిపాల్ గోపినాథ్, హెచ్‌వోడీలు మునివాసగం, మల్లిగ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి





ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్ - ముస్లింలకు స్వయంగా వడ్డిస్తున్న వినుత

శ్రీకాళహస్తి, మార్చి 28(శ్రీకాళహస్త): మైనార్టీల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నానని ఎమ్మెల్యే సుధీర్ చెప్పారు. పట్టణంలోని ఈదులగుంట ఈద్గా ప్రాంతంలో శుక్రవారం సాయంత్రం ఇఫ్తార్ విందు ఎమ్మెల్యే ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈద్గాలు, షాదీఖానాలు శ్రీకాళహస్తి నియోజకవర్గంలో నిర్మించిన ఏకైక నాయకుడు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి అన్నారు. టీడీపీ నాయకులు చెంచయ్య నాయుడు, విజయకుమార్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● శ్రీకాళహస్తి నియోజక వర్గ జనసేన ఇన్‌ఛార్జి కోట వినుత తన స్వగృహంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు.గణేష్, చంద్రశేఖర్, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

వార్డు సభ్యుడి ఫిర్యాదుతో అవినీతిపై విచారణ



రికార్డుల పరిశీలనలో అధికారులు

రేణిగుంట, మార్చి 28, (ఆంధ్రజ్యోతి): జనసేన పంచాయతీ వార్డు సభ్యుడు మెహబూబ్ బాషా ఫిర్యాదుతో శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో తిరుపతి డీఎల్పీవో సురేష్ నాయుడు విచారణ చేపట్టారు. గత ప్రభుత్వ హయాంలో 2021 నుండి జరిగిన అభివృద్ధి కార్యక్రమాల్లో అవినీతి జరిగిందని కలెక్టర్ కార్యాలయంలో ప్రజా వేదికలో వార్డు సభ్యుడు ఫిర్యాదు చేయగా ఈ విషయం పై జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవి తిరుపతి డీఎల్పీవోను విచారించాల్సిందిగా ఆదేశించారు. దీంతో ఆయన రికార్డులను పరిశీలించారు. శ్రీకాళహస్తి డీఎల్పీవో ప్రభు రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సాదర వీడ్కోలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాజశేఖర్

శ్రీకాళహస్తి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం విద్యార్థుల వీడ్కోలు సమావేశం, కళాశాల వార్షికోత్సవం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బి.రాజశేఖర్ మాట్లాడుతూ.. ధైర్యం, మేధస్సు సముపార్జన, కష్టపడేతత్వం, లక్ష్యసాధనతో ఉన్నత స్థానాలకు చేరుతారన్నారు. విద్యార్థులు తమ భవిష్యత్తును బంగారు బాటగా మార్చుకోవాలన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వైస్‌ప్రిన్సిపాల్ దీనదయాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఘనంగా అమావాస్య ఉత్సవం



శ్రీకాళహస్తి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం అమావాస్య ఉత్సవం ఘనంగా జరిగింది. జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడి ఉత్సవమూర్తులకు ఆలయంలోని అలంకార మండపంలో విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రాలనడుమ స్వామిఅమ్మవార్లు పురవీధుల్లో ఊరేగారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే జ్ఞానప్రసూనాంబకు శుక్రవారాన్ని పురస్కరించుకుని విశేష ఉత్సవం నిర్వహించారు. అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబిక అమ్మవారి ఉత్సవ మూర్తిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయంలో ప్రాకారంగా ప్రదక్షిణ చేసి తిరిగి కొలువు తీర్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆస్తిపన్ను చెల్లింపులకు ప్రత్యేక కౌంటర్లు

శ్రీకాళహస్తి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘ పరిధిలో ఆస్తి పన్ను చెల్లింపు కోసం ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ గిరికుమార్ తెలిపారు. ఆస్తిపన్ను బకాయిలు చెల్లింపులకు ఈనెల 31 చివరి తేదీ అన్నారు. ఏక మొత్తంలో చెల్లిస్తే 50 శాతం వడ్డీ రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. ఉదయం 6నుంచి 9గంటల వరకు ప్రత్యేక కౌంటర్ల ద్వారా చెల్లించవచ్చన్నారు. సెలవురోజుల్లో కూడా పన్ను చెల్లించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. అదే విధంగా ఆన్‌లైన్‌లో కూడా చెల్లించవచ్చన్నారు.

వేడుకగా పద్మావతమ్మ ఊంజలసేవ

నారాయణవనం, మార్చి 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రసిద్ధి చెందిన కల్యాణ వెంకన్న ఆలయంలో పద్మావతి అమ్మవారి ఊంజల సేవను శుక్రవారం వేడుకగా నిర్వహించారు. ఉదయం స్వామిఅమ్మవార్లకు శుక్రవారం సందర్భంగా నిత్య కైంకర్యాలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని నూతన పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, వేద పండితుల మంత్రోచ్చారణతో ఊంజల సేవను నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ భట్టాచార్య, శ్రీనివాసరాఘవ భట్టాచార్య, ఆలయాధికారి నాగరాజు సిబ్బంది పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో పలాస ఎమ్మెల్యే



శ్రీకాళహస్తి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శుక్రవారం పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఎమ్మెల్యే సుధీర్ వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయ స్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

దాతలకు సన్మానం



శ్రీకాళహస్తి, మార్చి 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ లీకేజీ పనులను నిర్వహించిన పుణెకు చెందిన వెంకీస్ గ్రూప్(లార్డ్ వెంకటేశ్వర చారిటబుల్ ట్రస్టు) ఏజీఎంను ఎమ్మెల్యే సుధీర్ సన్మానించారు. రూ.5కోట్లతో ఉచితంగా ఈ పనులను పూర్తి చేసిన విషయం విదితమే. ఈక్రమంలో సంస్థ అసిస్టెంట్ జనరల్ మేనేజరు విశాల్, ఢిల్లీ విశ్రాంత ఏఎస్‌ఐ జామ్‌వాల్‌ను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. శేషవస్త్రంతో సత్కరించి, స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

పాస్టర్ ప్రవీణ్ మరణంపై సమగ్ర విచారణ జరిపించాలి

రేణిగుంట, మార్చ్ 28, (ఆంధ్రజ్యోతి): పాస్టర్ ప్రవీణ్ పగడాల మరణం అనుమానాస్పదమని, ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని పరిశుద్ధ లూకా లూథరన్ సంఘ పాస్టర్ కెపి. లూథర్‌బాబు ప్రభుత్వాన్ని కోరారు. మండలం పరిధిలోని గాజులమండ్యం పరిశుద్ధ లూకా లూథరన్ సంఘం ఆధ్వర్యంలో వారు శుక్రవారం రాత్రి ప్రవీణ్ పగడాల మరణంపై శాంతి ర్యాలీ నిర్వహించారు. ప్రవీణ్ పగడాల మరణం రోడ్డు ప్రమాదంలా లేదని, ఎవరో హత్య చేసినట్లుగా అనుమానాలు ఉన్నాయన్నారు. పరిశుద్ధ లూకా లూథరన్ సంఘ పీసీసీ అధ్యక్షుడు కె.యేసురత్నం, వైస్ ప్రెసిడెంట్ కెపి సతీష్ జయకర్, సెక్రటరీ, నిర్మల చార్లెస్, కోశాధికారి కె. పుష్పాంజలి, కౌన్సిల్, అడ్మినిస్ట్రేషన్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.